ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 15 | ఎడిటర్: మేనం శ్యామ్ | సోమవారం 03-08-2026 | పేజీలు: 10

సిరా చుక్క

తెల్లటి గోడలు,నల్లటి నిజాలు
ప్రభుత్వ వైపాల్యాలు, వసతులు లేని ఆసుపత్రులు!
ప్రజల అకాల మరణాలు,చోద్యం చూస్తున్నా
ప్రభుత్వాలు.. తెల్ల గోడలపై.. ఆరోగ్యమె
మహాభాగ్యమని రాస్తారు లోపలికి వెళ్లాక,
ఆశలనే శవాలుగా మార్చుతారు.
దేశం ఎదిగిందంటారు...అంతరిక్షాన్ని
తాకిందంటారు...కానీ ఒక పేదవాడి ప్రాణం,
సర్కార్ హాస్పిటల్లో గ్యారంటీ లేకుండా
పోతుంది.. ప్రభుత్వం అంటే,
ప్రజల కోసమె కదా ...మరి ఆ....ప్రజలను
పట్టించుకోనేది ఎవరు!
ఓ.. అబద్ధం "ప్రపంచ స్థాయి అభివృద్ధి"అని..
ఓ... నిజం..ప్రభుత్వ ఆసుపత్రి ముందు
స్ట్రెచర్ కోసం ఎదురు చూస్తున్న రోగి..
ఇది అభివృద్ధా ?లేక, మనిషి ప్రాణాన్ని
అవమానించే నాగరికతా?
ప్రతి ఎన్నికల్లో..."ఆరోగ్యమే మహాభాగ్యం"
అని వేదికలపై గర్జించే నాయకులు..
ఎన్నికలు ముగిసిన వెంటనే...
ఆరోగ్యాన్ని కూడా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే
విషసంస్కృతి ఇంకా ఎన్నాళ్ళు..
ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక
యంత్రాలు ఉండకూడదా?
అత్యుత్తమ వైద్యులు ఉండకూడదా?
24 గంటల సేవలు ఉండకూడదా?
పేదవాడికి ప్రభుత్వ ఆసుపత్రిలో
గౌరవంగా చికిత్స పొందకూడదా?
అదే మీ ఇంట్లో ఎవరికైనా ప్రమాదం
జరిగితే...ముందుగా ఎక్కడికి తీసుకెళ్తారు?
ప్రభుత్వ ఆసుపత్రికా?
లేక...కార్పొరేట్ ఆసుపత్రికా? మీ సమాధానమే...
ప్రభుత్వ వైద్య వ్యవస్థకు,ఇచ్చే తీర్పు...

– రాగిపని బ్రహ్మచారి ..నల్గొండ..

బోనమెత్తిన లష్కర్..

- జై మహంకాళి నినాదాలతో మార్మోగిన సికింద్రాబాద్
- శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలతో కనువిందు
- ప్రభుత్వం తరపున బంగారు బోనం, పట్టు వస్త్రాల సమర్పణ
- సీఎం రేవంత్, బండి సంజయ్ తో పాటు పలువురు ప్రముఖుల అమ్మవారి దర్శనం
- 12,500 మంది పోలీసులతో అభేద్య భద్రత
- ఏఐ నిఘాతో కట్టుదిట్టమైన బందోబస్తు

ప్రజా వాయిస్,హైదరాబాద్: ఆషాఢ మాసానికి ఆధ్యాత్మిక శోభను తెచ్చే లష్కర్ బోనాలు ఆదివారం సికింద్రాబాద్‌ను భక్తిరసంలో ముంచెత్తాయి.తెల్లవారుజామునే జై మహంకాళి నినాదాలతో ఉజ్జయిని మహంకాళి ఆలయ పరిసరాలు మార్మోగాయి. తలపై బోనాలు మోసుకొచ్చిన మహిళలు, పూనకాలతో ఊగిపోయిన శివసత్తులు, డప్పుల మోతకు అడుగులు కలిపిన పోతురాజులు, పలారం బండ్ల శోభాయాత్రలతో లష్కర్ ప్రాంతమంతా ఓ మహోత్సవ వేదికగా మారింది.రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించగా.. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ కూడా బోనం సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందడం విశేషంగా నిలిచింది.

ఉజ్జయిని బోనాల్లో అమెరికా కాన్సుల్.. అమ్మవారికి ప్రత్యేక పూజలు

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన స్వాగతం పలికి, బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశిష్టతతో పాటు రంగం కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ఉదయం నుంచే భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

భక్తుల భద్రతే మా తొలి ప్రాధాన్యం

లష్కర్ బోనాల సందర్భంగా భక్తుల రక్షణ కోసం హైదరాబాద్ సిటీ పోలీసులు అత్యంత పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఉజ్జయిని మహంకాళి బోనాలకు

మిగతా 2లో

భారీ మెజార్టీ హామీ ఉంటేనే బరిలోకి..
లేదంటే ఇక ఎన్నికలకు గుడ్‌బై

- నల్లగొండ నుంచే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన రాజకీయ సంకేతాలు
- నాకు సొంత ఇల్లూ లేదు భూములూ లేవు ప్రజాసేవే నా సంపద అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు
- భారీ మెజార్టీతో గెలిపిస్తామనే నమ్మకం ఉంటేనే పోటీ చేస్తానని స్పష్టం
- నల్లగొండను రాష్ట్రానికే ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతున్నామని వెల్లడి
- మౌలిక వసతుల అభివృద్ధికి వేల కోట్లతో పనులు వేగవంతమవుతున్నాయన్న మంత్రి

ప్రజా వాయిస్,హైదరాబాద్:వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ నల్లగొండ రాజకీయాల్లో ఇప్పటి నుంచే వేడి పుట్టించేలా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తామని ముందే హామీ ఇస్తేనే మరోసారి ఎన్నికల బరిలోకి దిగుతా లేదంటే పోటీ చేయను అంటూ చేసిన ప్రకటన అధికార, ప్రతిపక్ష వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది.సాధారణ విజయం కాదు గతం కంటే మరింత భారీ ప్రజా తీర్పు కావాలనే సందేశాన్ని ఆయన స్పష్టంగా వినిపించారు. ప్రజల సంపూర్ణ విశ్వాసమే తన రాజకీయ జీవితానికి అసలు బలం అని, ఆ విశ్వాసమే తగ్గితే పదవుల కోసం రాజకీయాల్లో కొనసాగాల్సిన అవసరం

మిగతా 2లో

హైడ్రా కొరడా కమీషన్ లేనివారికేనా.?

- దుండిగల్ పెద్దచెరువు బఫర్ జోన్‌లో 150 విల్లాల నిర్మాణం జోరుగా
- 18 నెలల క్రితమే బఫర్ జోన్ అని ఇరిగేషన్ శాఖ లేఖ..అయినా గ్రీన్ సిగ్నల్ ఎలా.?
- ఔటర్ రింగ్ రోడ్డుకు కూతవేటు దూరంలో 8.25 ఎకరాల్లో విల్లాల ప్రాజెక్టు
- చిన్న నిర్మాణాలపై బుల్డోజర్లు.. భారీ ప్రాజెక్టుపై మాత్రం మౌనం ఎందుకు.?
- హైడ్రా పనితీరుపై ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలు

2 లో

నిరసనల ముసుగులో ఉగ్రకుట్ర

- జంతర్మంతర్ ఆందోళనల్లో అల్లర్లు రేపేందుకు పాక్ హ్యాండ్లర్ల పక్కా ప్రణాళిక
- పోలీసు యూనిఫామ్లో చొరబడి దేశ రాజధానిలో ఉద్రిక్తతలు సృష్టించాలన్న కుట్ర
- జైషే మహ్మద్ సంబంధాలున్న మహ్మద్ హమీమ్ మోండల్, అర్చితా సర్కార్ అరెస్ట్
- యూకే, మెక్సికో అంతర్జాతీయ సిమ్లు
- సోషల్ మీడియా, ఎన్క్రిప్టెడ్ యాప్లతో రహస్య కమ్యూనికేషన్
- స్లీపర్ సెల్ల యాక్టివేషన్పై దర్యాప్తు ముమ్మరం
- దేశవ్యాప్తంగా హైఅలర్ట్

2 లో

నామినేటెడ్ పోస్టులకు కాంగ్రెస్ గ్రీన్ సిగ్నల్

- వారంలోగా అర్హుల జాబితాలు పంపాలని జిల్లా అధ్యక్షులకు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశాలు
- పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే 60 శాతం ప్రాధాన్యం..విధేయులకు పెద్దపీట
- సిఫార్సులు, ఒత్తిళ్లకు తావులేదు..అర్హత, సేవల ఆధారంగానే ఎంపిక స్పష్టం
- జిల్లాల నుంచి వచ్చిన జాబితాల పరిశీలన అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి తుది జాబితా
- నామినేటెడ్ పోస్టుల భర్తీపై కాంగ్రెస్‌లో కదలిక..కార్యకర్తల్లో భారీ ఆశలు

2 లో

ఇంజనీర్లపై మాటల మంట..
రాహుల్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

- క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేతను నేరుగా ప్రశ్నించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- యువతే దేశ భవిష్యత్తు..వారిని అవమానించే హక్కు ఎవరికీ లేదన్న కేటీఆర్
- రేవంత్ వ్యాఖ్యలపై స్పందించడం రాహుల్ గాంధీ నైతిక, రాజకీయ బాధ్యత
- మౌనం పాటిస్తే సీఎం వ్యాఖ్యలను సమర్థించినట్టేనని ఘాటు హెచ్చరిక
- రేవంత్, రాహుల్ ఇద్దరూ విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

ప్రజా వాయిస్,హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి చేసిన క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాస్తూ పలు ప్రశ్నలు సంధించారు. యువతను కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం సమర్థిస్తుందా లేక ఖండిస్తుందా అన్న విషయాన్ని దేశ ప్రజలకు స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కేవలం ఒక రాజకీయ విమర్శ కాదని, లక్షలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి సాంకేతిక నిపుణులను తయారు చేసే విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ గా అభివర్ణించడం అత్యంత బాధాకరమని అన్నారు. అలాంటి వ్యాఖ్యలు యువతలో నిరాశను పెంచడమే కాకుండా, వారి కృషి, ప్రతిభను అవమానించినట్టేనని విమర్శించారు.

రాహుల్ స్పందించాల్సిందే

కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా యువతకు అవకాశాలు, ఉపాధి, విద్య గురించి మాట్లాడుతుందని, అలాంటి పార్టీకి చెందిన ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై స్పందించడం రాహుల్ గాంధీ నైతిక, రాజకీయ బాధ్యత అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయంలో రాహుల్ మౌనం పాటిస్తే, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు ఆయన ఆమోదం తెలిపినట్టే ప్రజలు భావించే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.

టీచర్లనూ అవమానించినట్టే

ఈ వ్యాఖ్యలు కేవలం విద్యార్థులకే పరిమితం కావని, వారిని తీర్చిదిద్దుతున్న ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులు, విద్యా

మిగతా 2లో

ప్రేమ పెళ్లి..రక్తపాతం

- కాళ్లు, చేతులు కట్టేసి భార్య గొంతు కోసిన భర్త
- వరంగల్ కృష్ణాకాలనీలో అర్ధరాత్రి దారుణం
- ఆరేళ్ల ప్రేమ బంధానికి విషాద ముగింపు
- తల్లి మృతితో అనాథలైన ఇద్దరు చిన్నారులు

2 లో



బోనమెత్తిన లష్కర్..

మొదటి పేజీ తరువాయి

సుమారు 12,500 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆలయ పరిసరాల్లో ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని, దీనివల్ల పాత నేరస్తులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

మేం ఏడిస్తే రాష్ట్రానికే అరిష్టం: జోగిని శ్యామల

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఏర్పాట్లపై ప్రముఖ జోగిని శ్యామల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జోగినిలకు తగిన గౌరవం, భద్రత కల్పించలేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. మేం కన్నీరు పెడితే రాష్ట్రానికే అరిష్టం. జోగినిలను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో కొంత ప్రాధాన్యం లభించిందని, ప్రస్తుతం మాత్రం ఐదు పాస్‌లకే పరిమితం చేసి ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. ఆలయ బోర్డుల్లో జోగినిలకు చోటు కల్పించాలని డిమాండ్ చేస్తూ, జోగినులు బోనం ఎత్తినప్పుడే అసలు బోనాల పండుగ అంటూ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

హైడ్రా కొరడా కమీషన్ లేనివారికేనా.?

ప్రజా వాయిస్,హైదరాబాద్: చెరువులను కాపాడతాం బఫర్ జోన్లలో ఒక్క అంగుళం కూడా ఆక్రమణను సహించం అంటూ ప్రభుత్వం, హైడ్రా తరచూ ప్రకటిస్తున్నాయి. కానీ దుండిగల్ పెద్దచెరువు బఫర్ జోన్‌లో వందల కోట్ల విలువైన విల్లా ప్రాజెక్టు నిర్మాణం మాత్రం నిరాటంకంగా కొనసాగుతుండడం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీసింది. చిన్నచిన్న నిర్మాణాలపై హైడ్రా బుల్డోజర్లు గర్జిస్తుంటే భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల విషయంలో మాత్రం ఎందుకు నిశ్శబ్దం పాటిస్తోందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

బఫర్ జోన్ అని ముందే హెచ్చరిక అయినా అనుమతులు

సుమారు 18 నెలల క్రితమే ఈ భూమి పెద్దచెరువు బఫర్ జోన్‌లో ఉందని ఇరిగేషన్ శాఖ అధికారి కంగా హెచ్ఎండీఏకు లేఖ రాసినట్లు సమాచారం. అయినప్పటికీ అదే స్థలంలో నిర్మాణాలకు అనుమతులు జారీ కావడం అధికార యంత్రాంగంపై అనుమానాలకు తావిస్తోంది.

150 విల్లాలు కోట్ల వ్యాపారం

ఔటర్ రింగ్ రోడ్డుకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో 8.25 ఎకరాల్లో సుమారు 150 విల్లాలను నిర్మిస్తున్నట్లు నిర్మాణ సంస్థ బహిరంగంగానే ప్రచారం చేస్తోంది. పనులు కూడా వేగంగా సాగుతున్నా.. ఇప్పటివరకు హైడ్రా, హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు కారణమవుతోంది.

చిన్నవారికి చట్టం పెద్దవారికి మినహాయింపా.?

సామాన్యులు చిన్న నిర్మాణం చేసినా హైడ్రా వెంటనే కూల్చివేతలు చేపడుతుండగా కోట్ల రూపాయల విలువైన భారీ ప్రాజెక్టుపై మాత్రం ఎందుకు చర్యలు లేవని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చట్టం అందరికీ సమానమే అయితే.. ఇక్కడ మాత్రం మౌనం ఎందుకని నిలదీస్తున్నారు.

ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్నలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువుల పరిరక్షణపై చేస్తున్న ప్రకటనలు కేవలం ప్రచారానికే పరిమితమా లేక కమీషన్లు చెల్లించని వారిపైనే హైడ్రా కొరడా ఝుళిపిస్తోందా అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం, హైడ్రా, హెచ్ఎండీఏ అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నామినేటెడ్ పోస్టులకు కాంగ్రెస్ గ్రీన్ సిగ్నల్

ప్రజా వాయిస్,హైదరాబాద్:తెలంగాణ కాంగ్రెస్‌లో నెలలుగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పదవుల కోసం ఎదురుచూస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఊరటనిచ్చేలా పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల వారీగా అర్హుల జాబితాలను వారం రోజుల్లో పంపించాలని జిల్లా అధ్యక్షులు, ఇన్‌ఛార్జి మంత్రులను ఆదేశించడంతో నియామకాల ప్రక్రియ వేగం పుంజుకుంది.

పార్టీ కోసం కష్టపడిన వారికే ప్రాధాన్యం

ఈసారి నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, గ్రామస్థాయి కార్యకర్తలకు పెద్దపీట వేయాలని కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. మొత్తం పదవుల్లో సుమారు 60 శాతం పార్టీకి విధేయంగా పనిచేసిన కార్యకర్తలకే ఇవ్వాలన్న నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

సిఫార్సులకు నో.. సేవలకే మార్కులు

ఈసారి సిఫార్సులు, ఒత్తిళ్లు, వర్గ రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా ఎంపికలు జరగనున్నాయి. వ్యక్తిగత సేవలు, పార్టీ పట్ల నిబద్ధత, ప్రజల్లో పనిచేసిన తీరు వంటి అంశాలనే ప్రధాన ప్రమాణాలుగా తీసుకోనున్నట్లు పీసీసీ స్పష్టం చేసింది.

సీఎం ఆమోదంతో ఒకేసారి ప్రకటన

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వేమ్ నరేందర్‌రెడ్డితో జరిగిన సమీక్షలో ఎంపికల విధానంపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. జిల్లాల నుంచి వచ్చిన జాబితాలను పరిశీలించిన అనంతరం తుది జాబితాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పించనున్నారు. సీఎం ఆమోదం లభించిన వెంటనే అన్ని నామినేటెడ్ పోస్టులను ఒకేసారి ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కార్యకర్తల్లో భారీ ఆశలు

నెలలుగా పదవుల కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ కార్యకర్తల్లో తాజా పరిణామాలతో కొత్త ఆశలు చిగురించాయి. ఎన్నికల సమయంలో పార్టీ విజయానికి శ్రమించిన వారికి న్యాయం జరుగుతుందనే నమ్మకం వ్యక్తమవుతోంది. పారదర్శకతతో పాటు విధేయులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న కాంగ్రెస్ నిర్ణయం రాజకీయంగా కూడా కీలకంగా మారే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

నిరసనల ముసుగులో ఉగ్రకుట్ర

ప్రజా వాయిస్,న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న సీజేపీ నిరసనలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ పన్నిన కుట్ర సంచలనం సృష్టించింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ జంతర్‌మంతర్ వద్ద నెల రోజులుగా కొనసాగుతున్న ఆందోళనల్లోకి పోలీసు యూనిఫామ్ ధరించి చొరబడి అల్లర్లు, రక్తపాతం సృష్టించాలన్న పక్కా ప్రణాళికను స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) భగ్నం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో అరెస్టైన మహ్మద్ హమీమ్ మోండల్, అతడి ప్రేయసి అర్పితా సర్కార్ విచారణలో ఈ కుట్రకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

పోలీసు దుస్తుల్లోనే అల్లర్లకు కుట్ర

పోలీసు యూనిఫామ్ ధరించి నిరసన ప్రాంతంలోకి ప్రవేశించి ఒక్కసారిగా ఉద్రిక్తతలు సృష్టించడం, ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించడం, భద్రతా వ్యవస్థపై అనుమానాలు కలిగించడమే ఉగ్రవాదుల అసలు లక్ష్యమని దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. దేశ రాజధానిలో అలజడి సృష్టించి అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠను దెబ్బతీయాలన్న దురుద్దేశంతో ఈ కుట్ర పన్నినట్లు అధికారులు వెల్లడించారు.

పాక్ హ్యాండ్లర్లతో రహస్య సంబంధాలు

హమీమ్ మోండల్ మొబైల్ ఫోన్, సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించగా పాకిస్థాన్‌కు చెందిన రానా, ఉజైర్, అబిద్ జట్–333, హమద్ తదితరులతో అతడు నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు తేలింది. వీరంతా షాజాద్ భట్టి నెట్‌వర్క్‌కు చెందిన హ్యాండ్లర్లుగా అనుమానిస్తున్నట్లు ఎస్‌టీఎఫ్ తెలిపింది. నిందితుల వద్ద నుంచి యూకే, మెక్సికోకు చెందిన అంతర్జాతీయ సిమ్ కార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు.

సోషల్ మీడియానే ఉగ్రవాదుల ఆయుధం

ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌లు, సోషల్ మీడియా వేదికల ద్వారా హ్యాండ్లర్లతో రహస్యంగా సమాచార మార్పిడి జరిగినట్లు అధికారులు గుర్తించారు. స్లీపర్ సెల్‌లను యాక్టివేట్ చేయడం, నిరసనల పేరుతో అల్లర్లను రెచ్చగొట్టడం, భద్రతా బలగాలను తప్పుదోవ పట్టించడం వంటి అంశాలపై కూడా విచారణ కొనసాగుతోంది.

దేశవ్యాప్తంగా అప్రమత్తమైన నిఘా సంస్థలు

ఈ కుట్ర బయటపడటంతో ఢిల్లీతో పాటు దేశంలోని కీలక నగరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పెద్ద ఎత్తున జరిగే నిరసనలు, సభలు, ప్రజా కార్యక్రమాలపై కేంద్ర నిఘా సంస్థలు ప్రత్యేక నిఘా పెట్టాయి. రాజకీయ నిరసనలను అడ్డంగా పెట్టుకుని ఉగ్రవాదులు దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్న అనుమానాల నేపథ్యంలో అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసినట్లు సమాచారం.

భారీ మెజార్టీ హామీ ఉంటేనే బరిలోకి..

లేదంటే ఇక ఎన్నికలకు గుడ్‌బై

మొదటి పేజీ తరువాయి

లేదని వ్యాఖ్యానించారు.

గెలుపు కాదు... ప్రజల గుండెల్లో స్థానం ముఖ్యం

తన రాజకీయ ప్రస్థానం పదవుల కోసం కాదని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికేనని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఎన్నిక తనకు ఒక పరీక్షేనని, ప్రజలు గతం కంటే అధిక మెజార్టీతో ఆశీర్వదిస్తేనే మరోసారి వారి ముందుకు వస్తానని చెప్పారు.అభివృద్ధి పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నల్లగొండలో జరుగుతున్న అభివృద్ధి పనులు కేవలం ఎన్నికల కోసం కాదని, రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చేపడుతున్నామని వివరించారు.

నాకు ఇల్లూ లేదు... భూములూ లేవు... ప్రజల ప్రేమే నా ఆస్తి

వ్యక్తిగత ఆస్తులు కూడబెట్టడంపై తనకు ఎప్పుడూ ఆసక్తి లేదని కోమటిరెడ్డి పేర్కొన్నారు. నల్లగొండలో నాకు సొంత ఇల్లు లేదు. మా గ్రామంలో కూడా భూములు లేవు. ప్రజలు ఇచ్చిన ప్రేమ, విశ్వాసమే నా అసలు సంపద అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు.ప్రజాసేవను రాజకీయాల కంటే గొప్ప బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. ప్రభుత్వం నల్లగొండ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. కార్పొరేషన్ హోదా తర్వాత పట్టణంలో మౌలిక వసతుల కల్పన వేగవంతమైందని, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టామని వివరించారు.

రోల్‌మోడల్ నల్లగొండ... అదే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంలోనే అత్యుత్తమ నగరాల సరసన నల్లగొండను నిలబెట్టే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఆధునిక సదుపాయాలతో కూడిన నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనులు చేపడుతున్నాయని తెలిపారు.అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగాలంటే ప్రజల మద్దతు ఎంతో అవసరమని కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజలు ఇచ్చే భారీ మెజార్టీతో ప్రభుత్వంపై మరింత బాధ్యత పెరుగుతుందని, అదే అభివృద్ధికి బలమైన పునాది అవుతుందని అన్నారు.

భారీ మెజార్టీ... అభివృద్ధికి ప్రజల ముద్ర

ఎన్నికల్లో వచ్చే మెజార్టీని కేవలం గెలుపుగా కాకుండా అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల విశ్వాసంగా భావిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు. ప్రజల తీర్పు ఎంత బలంగా ఉంటే, అంత ధైర్యంగా అభివృద్ధి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

కోమటిరెడ్డి వ్యాఖ్యల వెనుక రాజకీయ వ్యూహమా.?

భారీ మెజార్టీతోనే పోటీ చేస్తానన్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీశాయి. ఇది ప్రజలకు ఇచ్చిన సందేశమా ప్రత్యర్థులకు విసిరిన సవాలా లేక ఎన్నికల ముందు రాజకీయ వ్యూహంలో భాగమా అనే చర్చ నల్లగొండ రాజకీయాల్లో జోరుగా సాగుతోంది.

ఇంజనీర్లపై మాటల మంట.. రాహుల్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

మొదటి పేజీ తరువాయి

వ్యవస్థను కూడా కించపరిచేలా ఉన్నాయని కేటీఆర్ విమర్శించారు. వేలాది మంది అధ్యాపకుల సేవలను తక్కువ చేసి చూపేలా సీఎం మాట్లాడటం బాధ్యతారాహిత్యమని అన్నారు.

యువతే దేశ బలం

ఇంజనీర్లు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా భారత ఇంజనీర్లు తమ ప్రతిభను చాటుతున్న సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని కేటీఆర్ పేర్కొన్నారు. యువతను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వ పెద్దలే వారిని అవమానించేలా మాట్లాడటం సరైన విధానం కాదని విమర్శించారు.

క్షమాపణే మార్గం

ఈ వివాదానికి తెరపడాలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఇంజనీరింగ్ విద్యార్థులకు, అధ్యాపకులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా తన వైఖరిని స్పష్టం చేసి, యువత మనోభావాలను గౌరవిస్తున్నామని ప్రకటించాలని బహిరంగ లేఖలో

భారత రాష్ట్ర సమితి
BHARAT RASHTRA SAMITHI
Office : Telangana Bhavan, Road No : 10, Banjara Hills, Hyderabad 500 034.

K. TARAKA RAMA RAO
Working President

Date :
Date: 02.08.2026

Dear Rahul Gandhi ji,

India's youth are not merely the future of this nation-they are its greatest strength today. They are the architects of a new India. They are the engineers designing cutting-edge technologies, the innovators building global startups, the scientists taking India from the Moon to Mars, the coders powering the digital revolution, and the entrepreneurs creating opportunities for millions. From Artificial Intelligence to aerospace, from semiconductors to space technology, India's young minds are writing the country's next chapter with talent, perseverance and imagination. Every bridge we build, every satellite we launch, every software platform that powers the world and every technological breakthrough that carries the Indian flag higher is the result of the hard work of engineers, scientists, teachers and students. They deserve admiration, encouragement and respect-not humiliation.

History has repeatedly shown that whenever India's youth believe they have been wronged or insulted, they do not retreat-they rise. You, of all people, should know this. Congress party has witnessed it through history, from the resistance against the Emergency under Smt. Indira Gandhi to Telangana's statehood movement during the UPA era under Smt. Sonia Gandhi, where lakhs of young people, under the leadership of Shri. KCR Garu, fought relentlessly until Telangana became a reality. Every generation has reminded governments that the self respect of young people cannot be ignored, intimidated or insulted.

It is in that spirit that I write this letter to you. As the principal campaigner of the Congress Party, the leader who personally sought the mandate of Telangana's youth and the person who handpicked Mr. Revanth Reddy as Chief Minister, the political as well as moral responsibility ultimately rests with you.

1|Page

కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నెలకొన్న ఆగ్రహాన్ని తేలికగా తీసుకోవద్దని, యువత ఆత్మగౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు.



ప్రేమ పెళ్లి..రక్తపాతం

ప్రజా వాయిస్,వరంగల్: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యనే అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన వరంగల్ నగరంలో సంచలనం రేపింది. జీవితాంతం తోడుంటానని ఏడడుగులు నడిచిన భర్తే చివరకు కాళ్లు, చేతులు కట్టేసి కత్తితో గొంతు కోసి ప్రాణాలు తీశాడు.కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాలుగో డివిజన్ కృష్ణాకాలనీలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది.

ప్రేమతో మొదలైన బంధం..రక్తంతో ముగిసింది

జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతల తండాకు చెందిన గుగులోత్ రజిత (26), నర్సంపేట మండలం రాజీపేటకు చెందిన అనిల్ ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఉపాధి కోసం నెల రోజుల క్రితం వరంగల్‌కు వచ్చి కృష్ణాకాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు.

బతుకుదెరువు కోసం నగరానికి.. ఎదురైంది మృత్యువు

కొంతకాలంగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. శనివారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన అనిల్, భార్య కాళ్లు,చేతులు కట్టేసి కత్తితో మెడ కోసినట్లు సమాచారం. తీవ్ర రక్తస్రావంతో రజిత అక్కడికక్కడే మృతి చెందింది.

అద్దె ఇల్లు ఒక్కసారిగా నేరస్థలంగా మారింది

హత్య జరిగిన విషయం తెలుసుకున్న స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న కాకతీయ యూనివర్సిటీ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

ప్రేమ పెళ్లి..పసిపిల్లలకు విషాదం

ఈ ఘటనలో అత్యంత విషాదకరమైన విషయం ఏమిటంటే... తల్లి హత్యకు గురి కావడం, తండ్రి నిందితుడిగా మారడంతో ఇద్దరు చిన్నారులు ఒకే రాత్రిలో దిక్కులేని వారయ్యారు. వారి భవిష్యత్తుపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబ కలహాలే కారణమా.?

కుటుంబ విభేదాలే హత్యకు కారణమా? లేక మరేదైనా నేపథ్యం ఉందా? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు.

ఉద్యాన శాఖ ఉనికి ఎక్కడ?

- రైతు ఆదాయాన్ని పెంచే రంగానికి ఎందుకీ నిర్లక్ష్యం?
- రాష్ట్ర అవసరాలకు కూడా సరిపోని పండ్లు, కూరగాయల ఉత్పత్తి
- ఉద్యాన శాఖ బలోపేతమే శాశ్వత పరిష్కారం

ప్రజా వాయిస్ డెస్క్, హైదరాబాద్. తెలంగాణలో సుమారు ఐదు కోట్ల జనాభా ఉంది. అయితే రాష్ట్రంలో పండుతున్న ఉద్యాన పంటలు, ముఖ్యంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి రాష్ట్ర అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతోంది. ఫలితంగా ప్రతి రోజు పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా కూరగాయలు, పండ్లు దిగుమతి అవుతున్నాయి. దీనివల్ల రాష్ట్ర సంపద ఇతర రాష్ట్రాలకు వెళ్లడమే కాకుండా, తెలంగాణ రైతులు పొందాల్సిన ఆదాయం కూడా బయటకు వెళుతోంది.వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చగలిగే రంగాల్లో ఉద్యాన రంగం అత్యంత కీలకమైనది. తక్కువ విస్తీర్ణంలో అధిక ఆదాయం, ఏడాది పొడవునా ఉపాధి, విలువ ఆధారిత పరిశ్రమలు, ఎగుమతుల అవకాశాలు, పోషకాహార భద్రత వంటి అనేక ప్రయోజనాలు ఈ రంగం సొంతం.అయినప్పటికీ తెలంగాణలో ఉద్యాన రంగం తన పూర్తి సామర్థ్యాన్ని ఇంకా అందుకోలేకపోతోంది.

ఉద్యాన విశ్వవిద్యాలయం ఉంది... కానీ బలమైన వ్యవస్థ ఎక్కడ?

రాష్ట్ర విభజన అనంతరం ఏర్పాటైన కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ద్వారా డిగ్రీ, డిప్లొమా కళాశాలల నుంచి ప్రతి సంవత్సరం వందలాది ఉద్యాన శాస్త్ర నిపుణులు బయటకు వస్తున్నారు.అయితే వీరిలో చాలామందికి ఉద్యాన శాఖలో ఉద్యోగ అవకాశాలు పరిమితంగానే ఉన్నాయి. ఒకవైపు చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు తగ్గుతుండగా, మరోవైపు రైతులకు అవసరమైన సాంకేతిక సేవలు క్షేత్రస్థాయిలో అందడం లేదు. అలాగే ఉద్యాన పరిశోధన సంస్థల పనితీరు కూడా ఆశాజనకంగా లేదు, ఇంకా ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా విభాగాల్లో సరిపడా సిబ్బంది,శాస్త్రవేత్తలు లేక ఉద్యాన రంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది..ఈ పరిస్థితి ఉద్యాన రంగ అభివృద్ధిని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది.

జిల్లాలు పెరిగాయి... ఉద్యాన శాఖ మాత్రం అదే స్థాయిలో విస్తరించలేదు

రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరిగి పరిపాలన ప్రజలకు మరింత చేరువైంది. కానీ ఉద్యాన శాఖలో అదే స్థాయిలో పోస్టుల పెంపు జరగలేదు. అనేక జిల్లాల్లో సిబ్బంది కొరత కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన అధికారుల పోస్టులు ఖాళీగా ఉండగా, మరికొన్ని చోట్ల అవసరానికి తగిన సిబ్బంది అందుబాటులో లేరు.దీంతో రైతులకు సమయానికి సాంకేతిక సలహాలు, పంటల ప్రణాళిక, తెగుళ్ల నివారణ, ప్రభుత్వ పథకాల అమలు వంటి సేవలు సమర్థవంతంగా అందడం కష్టమవుతోంది.

అరకొర అధికారులతో ఉద్యానాభివృద్ధి సాధ్యమేనా?

ప్రస్తుతం తెలంగాణ ఉద్యాన శాఖలో సుమారు 153 మంది ఉద్యాన అధికారులు మాత్రమే ఉన్నారని, వారిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారి సంఖ్య ఇంకా తక్కువగా ఉందని అందుబాటులో ఉన్న సమాచారం సూచిస్తోంది. 563 మండలాలకు ఈ సంఖ్య సరిపోదు. ఫలితంగా ఒక్కో అధికారి అనేక మండలాల బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు నిరంతర సాంకేతిక సేవలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, వ్యాధులు–తెగుళ్ల నియంత్రణ, మార్కెట్ సమాచారాన్ని అందించడం వంటి అంశాలు ప్రభావితమవుతాయి.

రైతు ఆదాయం పెరగాలంటే ఉద్యాన శాఖ బలోపేతం తప్పనిసరి

వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులు, వాతావరణ మార్పులు, ధరల అస్థిరత రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతు ఆదాయాన్ని పెంచగలిగే ప్రధాన రంగంగా ఉద్యాన రంగాన్ని ప్రభుత్వం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

దీనికోసం కొన్ని కీలక చర్యలు అవసరం.

★ ఉద్యాన అధికారుల ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేసి ప్రతి మండలానికి కనీసం ఒక ఉద్యాన అధికారిని, ఒక విస్తరణ అధికారిని అందుబాటులో ఉంచాలి.★ ఉద్యాన కళాశాలలో,పరిశోధనా సంస్థల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి ★ ఉద్యాన శాస్త్రం చదివిన యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.★ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ క్రాప్ ప్లానింగ్ అమలు చేయాలి.★ పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలకు ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేయాలి.★ ఉద్యాన రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేసి సేకరణ, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలి.★ కోల్డ్ స్టోరేజీలు, ప్యాక్ హౌస్‌లు, రైపెనింగ్ చాంబర్లు, రిఫ్రిజిరేటెడ్ రవాణా వంటి మౌలిక వసతులను విస్తరించాలి.★ ఉద్యాన ఉత్పత్తులకు రవాణా సబ్సిడీ, ఎగుమతి ప్రోత్సాహకాలు అందించాలి.★ పండ్లు, కూరగాయలకు ధర భరోసా లేదా కనీస ధర రక్షణ వ్యవస్థను రూపొందించాలి.★ ఉద్యాన పంటలకు ప్రత్యేక పంట బీమా అమలు చేయాలి.★ గ్రామీణ ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి.★ ఉద్యాన రంగ స్టార్టప్‌లకు ప్రత్యేక విధానం, ఆర్థిక సహాయం అందించాలి.★ సేంద్రియ ఉద్యాన సాగు, పట్టణ మిద్దె తోటల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి.

ఉద్యాన రంగం బలపడితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకే బలం

ఉద్యాన రంగం కేవలం రైతుల ఆదాయాన్ని పెంచే రంగం మాత్రమే కాదు. ఇది గ్రామీణ ఉపాధి, మహిళల స్వయం ఉపాధి, పోషకాహార భద్రత, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఎగుమతుల అభివృద్ధికి కూడా కీలక ఆధారం. ఈ రంగంలో పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే సామర్థ్యం కలిగి ఉంది.తెలంగాణలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చాలంటే ఉద్యాన రంగానికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఉద్యాన శాఖను పునర్వ్యవస్థీకరించడం, ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, శాస్త్రీయ సాంకేతిక సేవలను ప్రతి రైతుకు చేరవేయడం ద్వారా మాత్రమే ఈ రంగం ఆశించిన స్థాయికి చేరుకోగలదు.రైతు ఆదాయం పెరగాలంటే ఉద్యాన రంగం బలపడాలి. ఉద్యాన రంగం బలపడాలంటే ఉద్యాన శాఖ బలోపేతం కావాలి. అదే తెలంగాణ వ్యవసాయాభివృద్ధికి శాశ్వత మార్గం.

గుర్రంపోడులో ఘనంగా ప్రెస్ క్లబ్ తొలి వార్షికోత్సవ వేడుకలు

- బుసిరెడ్డి పాండురంగారెడ్డి చేతుల మీదుగా కేక్ కటింగ్
- క్యారమ్స్ విజేతలకు బహుమతులు
- సందడి చేసిన వార్షికోత్సవం

ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం,నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో ఆదివారం ప్రెస్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రెస్ క్లబ్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా బుసిరెడ్డి పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం, ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు జర్నలిస్టులు నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమైనదని ఆయన కొనియాడారు.ఆకట్టుకున్న క్యారమ్స్ పోటీలుప్రెస్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానికులకు నిర్వహించిన క్యారమ్స్ పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విజేతలకు షేక్ మహబూబ్ పాషా, మేడి వెంకన్న, కేసాని వెంకట్ రెడ్డి, కూనూరు సైదిరెడ్డి, ఇనుపాముల రామారావులు ముఖ్య అతిథులతో కలిసి బహుమతులను అందజేశారు. ఈ వేడుకల్లో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కార్యదర్శులు, సభ్యులు, బుసిరెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మత్తులో..... ముత్తారం

- విచ్చలవిడిగా బెల్టు షాపులు
- అక్రమంగా సెట్టింగ్ ఏర్పాటు
- బెల్ట్ షాపులకు వైన్స్ నిర్వాహకులు ప్రోత్సాహం

ప్రజా వాయిస్ ముత్తారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో మద్యం ఏరులై పారుతోంది. అధికారుల అలసత్వంతో గల్లీకో బెల్ట్ షాపు ఏర్పాటు చేస్తూ అందినకాడికి దండు కుంటోంది. నివాస గృహాలు, చిన్న చిన్న కిరాణా షాపుల్లోనూ కావాల్సినంత మద్యం దొరుకు తోంది. వైన్, బార్ షాపుల్లో సమయం ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో 24 గంటలు అందుబాటులో ఉంటోంది. వైన్, బార్ షాపుల్లో సమయం ప్రకారం మద్యం లభ్యమవు తుండగా బెల్టు షాపుల్లో 24 గంటలు అందుబా టులో ఉంటోంది. ఎప్పుడంటే అప్పుడు ఏ బ్రాండ్ అంటే బ్రాండ్ వైన్ షాపుల మాదిరి ఇళ్లలోనే లభ్యం అవుతోంది. కిలోమీటర్ల మేర దూరంలోని వైన్ షాపులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఐదో, పదో ఎక్కువిస్తే ఇంటి పక్కనే మద్యం దొరుకుతోంది.

వైన్స్ లకు అనుబంధంగా బెల్టు షాపులు

ఒక్కో వైన్ షాపు పరిధిలో కనీసం 30 చొప్పున బెల్టు షాపులు అనుబంధంగా పని చేస్తున్నాయి. తమ టార్గెట్లు చేరుకొనేందుకు బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ, అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్షా షాపుల నిర్వా హకులే ప్రోత్సహిస్తు న్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైÑపుల నుండి ఎమ్మార్పీ ధరలకు కొనుగోలు చేస్తున్న బెల్టు షాపుల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్ బాటిల్ పై రూ.20 అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలు సాగిస్తు న్నారు. మండలం లో ఎక్కడ చూసినా బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి.

అక్రమంగా సిట్టింగ్లు ఏర్పాటు

బెల్టు షాపుల్లో సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తూ ఆహార పదార్థాలు తయారు చేస్తూ.. మందుబాబులకు అందజేస్తూ.. బెల్టు షాపుల మధ్య పోటీ పెరగ డంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇళ్లలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్టు షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, అమ్లెట్, తదితర ఆహార పదార్థా లను వండి అందజేస్తున్నారు.

పెద్దవంగర ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా దుర్సోజు రాజశేఖర్

- ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం
- జర్నలిస్టుల సంక్షేమం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ

ప్రజా వాయిస్ పెద్దవంగర, ఆగస్టు 2 ....పెద్దవంగర ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు దుర్సోజు రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో నిర్వహించిన ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా రంగు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి ఓంకార్, ఉపాధ్యక్షుడిగా చట్టు యాకన్న, కోశాధికారిగా బారీ విక్రమ్, కార్యదర్శులుగా జాటోత్ దామోదర్, జాటోత్ సుధాకర్, ఓరిగంటి సైదులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దుర్సోజు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి సుంకరి ఓంకార్ మాట్లాడుతూ అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఎలాంటి జాప్యం లేకుండా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు.ప్రెస్ క్లబ్ అభివృద్ధి, జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన విలువల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. యువ జర్నలిస్టులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ, సభ్యులందరినీ కలుపుకొని ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా అవగాహన కార్యక్రమాలను కూడా చేపడతామని వెల్లడించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలను కాపాడుకోవాలి

- బస్తీలోని ప్రధాన వీధుల్లో పాదయాత్ర.

ప్రజా వాయిస్ మియాపూర్: పంచ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా పౌరుల హక్కులతో పాటు వారి బాధ్యతలను గుర్తు చేస్తూ రామ్ నరేష్ నగర్ యువకులు ఆదివారం ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బస్తీలోని ప్రధాన వీధుల్లో పాదయాత్ర చేపట్టి ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రాంగ్ సైడ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, ట్రాఫిక్ సిగ్నళ్లను తప్పనిసరిగా పాటించడం, హెల్మెట్ ధరించడం, నిర్ణీత వేగ పరిమితిని అనుసరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని నివారించడం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరి భద్రత కోసమే రూపొందించబడ్డాయని యువకులు పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నియమాలను స్వచ్ఛందంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వారు తెలిపారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను ఆదర్శంగా పాటించి సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు.రెండు వారాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బస్తీ వాసి నరసింహ స్మారకార్థం ఈ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆయన జ్ఞాపకార్థం ఇలాంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం తీసుకురావాలని నిర్వాహకులు నిర్ణయించినట్లు వెల్లడించారు.



రంగుల్లో ప్రతిభ..చిత్రాల్లో సృజన.. ఆర్ట్ స్పార్క్-3.0 ఘన విజయం

- 5 ఏళ్ల చిన్నారి నుంచి 70 ఏళ్ల కళాకారుడి వరకు 75కిపైగా అద్భుత చిత్రాల ప్రదర్శన
- దేశవ్యాప్తంగా 10 వేల మందికి పైగా విద్యార్థులను తీర్చిదిద్దిన చారూస్ కాన్వాస్ ఆర్ట్ క్లాసెస్

స్రజా వాయిస్,హైదరాబాద్: కళా వైభవానికి వేదికగా నిలిచిన హైదరాబాద్ స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో చారూస్ కాన్వాస్ ఆర్ట్ క్లాసెస్ నిర్వహించిన ఆర్ట్ స్పార్క్–3.0 వార్షిక కళా ప్రదర్శన ఘనంగా ముగిసింది. ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌ను ప్రఖ్యాత కళాకారుడు శశాంక్ శుక్లా ప్రారంభించగా, ఆర్ట్ ఎడ్యుకేటర్ చారూ కేసర్వాణి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. 5 ఏళ్ల చిన్నారుల నుంచి 70 ఏళ్ల వయస్సు గల కళాకారులు రూపొందించిన 75కిపైగా చిత్రాలు సందర్శకులను రంగుల ప్రపంచంలో విహరింపజేశాయి. వాటర్ కలర్, అక్రిలిక్, ఆయిల్, మిక్స్‌డ్ మీడియా తదితర విభాగాల్లో రూపొందిన కళాఖండాలు కళాభిమానుల ప్రశంసలు అందుకున్నాయి. చారూస్ కాన్వాస్ ఆర్ట్ క్లాసెస్ ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 10 వేల మందికి పైగా విద్యార్థులు చిత్రకళలో శిక్షణ పొందడం సంస్థ విశిష్టతగా నిలిచింది. రెండు రోజుల పాటు కళాభిమానులతో కళకళలాడిన ఈ ప్రదర్శన విజయవంతంగా ముగిసింది.

ప్రభుత్వ భూమి ఫెన్సింగ్ మాయం

- రాత్రికి రాత్రే ఎవరి చేతులు?
- పెట్‌బషీరాబాద్ సర్వే నం.23 వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలి
- బీజేపీ

ప్రజావాయిస్, కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పెట్‌బషీరాబాద్ సర్వే నంబర్ 23లో ఉన్న ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారులు గతంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను ఇటీవల రాత్రికి రాత్రే తొలగించడం అనుమానాలకు తావిస్తున్నదని బీజేపీ అధికార ప్రతినిధులు నల్ల జయశంకర్ గౌడ్, ఆకుల సతీష్ ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూమికి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను ఏ కారణంతో తొలగించారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఫెన్సింగ్ తొలగింపునకు ఎవరు ఆదేశాలు ఇచ్చారు? దీని వల్ల ఎవరికి లాభం చేకూరుతోంది? అనే అంశాలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి నిజాలు బయటపెట్టాలని వారు పేర్కొన్నారు.ఈ భూమి వ్యవహారం గత ప్రభుత్వ హయాంలో కూడా వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విచారణలో అక్రమాలు తేలితే బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా, ఈ భూమి వివాదానికి సంబంధించి గత ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన కేటీఆర్ కూడా తన వైఖరిని ప్రజలకు స్పష్టం చేయాలని వారు అన్నారు.ప్రభుత్వ భూముల పరిరక్షణ రాజకీయాలకు అతీతంగా జరగాలని, కోట్ల రూపాయల విలువైన ప్రజా ఆస్తులను కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని నల్ల జయశంకర్ గౌడ్, ఆకుల సతీష్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పారదర్శకంగా వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

యూరియా కోసం అన్నదాతల అగచాట్లు

- ప్రభుత్వం నిద్రలోనా..లేక అధికారులు చేతులెత్తేశారా..?
- బుక్ చేసుకోమంటారు.. స్టాక్ లేదంటారు..
- రైతు పంట ఎండిపోతే బాధ్యత ఎవరిది?

ప్రజావాయిస్ / మోమిన్‌పేట్ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అత్యంత అవసరమైన యూరియా ఎరువు అందుబాటులో లేక అన్నదాతలు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు అత్యవసరంగా యూరియా వేయాల్సిన సమయంలో ఎరువుల కోసం రైతులు రోజుల తరబడి తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు.యూరియా కావాలంటే ముందుగా బుకింగ్ చేసుకోవాలని అధికారులు, ఎరువుల విక్రయ కేంద్రాల నిర్వాహకులు సూచిస్తున్నారు. అయితే బుకింగ్ చేసేందుకు వెళ్లిన రైతులకు "స్టాక్ లేదు" అనే సమాధానం మాత్రమే వినిపిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. బుక్ చేసుకోమంటారు... స్టాక్ లేదంటారు... మరి రైతులు ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నిస్తున్నారు.పంటల కోసం రేయింబవళ్లు కష్టపడేది రైతే... కానీ అవసరమైన సమయంలో యూరియా కూడా అందించలేని పరిస్థితి ఎందుకు వచ్చింది?" అంటూ అన్నదాతలు మండిపడుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పంటలకు సకాలంలో ఎరువులు వేయకపోతే దిగుబడి తగ్గి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ శాఖ అధికారులు యూరియా కొరతపై స్పష్టత ఇవ్వకపోవడం, సరఫరాపై ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులను ఇబ్బందులకు గురిచేసే బుకింగ్ విధానాన్ని వెంటనే సరిచేసి, ప్రతి ఎరువుల కేంద్రంలో తగినంత యూరియా నిల్వలు ఉంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.రైతు పంట ఎండిపోతే బాధ్యత ఎవరిది..? అధికారులు సమాధానం చెప్పాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యూరియా కొరతను వెంటనే నివారించాలి. లేదంటే రైతు సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని రైతులు హెచ్చరిస్తున్నారు.

బైపాస్ బలి.. కంటైనర్ ఢీకొని మహిళ మృతి

- భర్తకు గాయాలు.. వాహనంతో పరారైన డ్రైవర్ కోసం గాలింపు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం
- టూ టౌన్ సీఐ సోమనరసయ్య.

ప్రజా వాయిస్,మిర్యాలగూడ.మిర్యాలగూడ పట్టణంలోని రవీంద్రనగర్ బైపాస్ రోడ్డుపై ఆదివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. కంటైనర్ వాహనం ఢీకొనడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త గాయపడ్డాడు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ వాహనంతో పరారవడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.మిర్యాలగూడ II టౌన్ సీఐ సోమనరసయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం వాటర్ ట్యాంక్ తండాకు చెందిన ధనావత్ సేవ్య తన భార్య ధనావత్ కమలతో కలిసి యాక్టివా స్కూటీ (టీఎస్ 05 ఎఫ్ఎఫ్ 9349)పై ఆదివారం ఉదయం సుమారు 8.10 గంటలకు మిర్యాలగూడకు బయలుదేరాడు. రవీంద్రనగర్ బైపాస్ రోడ్డును దాటుతున్న సమయంలో నల్గొండ నుంచి వాడపల్లి వైపు వెళ్తున్న కంటైనర్ (ఆర్జే 11 జీసీ 8385) అతి వేగంగా వచ్చి స్కూటీని బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో స్కూటీ వెనుక కూర్చున్న ధనావత్ కమల తీవ్ర గాయాలతో ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. స్కూటీ నడుపుతున్న ధనావత్ సేవ్యకు ముఖం ఎడమ వైపు, ఎడమ కాలి మడమ వద్ద గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కంటైనర్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడని పోలీసులు తెలిపారు.బాధితుడి ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ II టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సోమనరసయ్య తెలిపారు. పరారీలో ఉన్న కంటైనర్ డ్రైవర్‌ను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు గాలింపు ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.

మానవ జీవితానికి మార్గదర్శిని 'భగవద్గీత'

- ఫసల్వాడి జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి
- గీతా వాహిని ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా భగవద్గీత పారాయణం
- వికారాబాద్ వైభవలక్ష్మి ఆలయంలో భక్తిశ్రద్ధలతో మహోత్సవం ముగింపు

ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:వికారాబాద్ జిల్లా కేంద్రంలోని వైభవలక్ష్మి ఆలయంలో గీతా వాహిని ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న భగవద్గీత పారాయణ మహోత్సవం ఆదివారం తొమ్మిదవ రోజుతో ఘనంగా ముగిసింది. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో నిర్వహించిన ఈ పారాయణ కార్యక్రమాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాయి.గీతా వాహిని సంస్థ గత తొమ్మిది సంవత్సరాలుగా నిరంతరంగా భగవద్గీత ప్రచారం నిర్వహిస్తూ, భగవద్గీతలోని జీవన విలువలు, ధర్మబోధనలు, ఆధ్యాత్మిక సందేశాలను సమాజానికి చేరవేస్తూ విశేష సేవలు అందిస్తోంది.ఈ ముగింపు కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా ఫసల్వాడి జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ.. భగవద్గీత మానవ జీవితానికి మార్గదర్శిని అని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన గీతా సందేశం నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. మహిళలు కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలని పేర్కొంటూ, వారి జీవన విధానం, దైవారాధనలో పాటించాల్సిన నియమాలు, పూజా విధానాలు, వివిధ వ్రతాలను శాస్త్రోక్తంగా ఎలా ఆచరించాలి, సనాతన ధర్మ సంప్రదాయాలను ఎలా పరిరక్షించాలనే అంశాలను సులభంగా వివరించారు. భక్తి, సేవ, ధర్మం, సత్సంకల్పం, నిత్య పారాయణం ద్వారా కుటుంబాల్లో శాంతి, సౌభాగ్యం, ఆధ్యాత్మిక వికాసం కలుగుతాయని ఆయన తెలిపారు. ఆయన ప్రసంగం భక్తులను విశేషంగా ఆకట్టుకుని ఆధ్యాత్మిక చింతనలో ముంచెత్తింది.ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది మహిళా భక్తులు, కాలనీవాసులు, వికారాబాద్ పట్టణం మరియు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం అంతా గీతా పారాయణం, మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గీతావాహిని అధ్యక్షురాలు శ్రీదేవి , ప్రధాన కార్యదర్శి జై శ్రీ కమిటీ సభ్యులు మాధురి విజయలక్ష్మి ఝాన్సీ రాణి నీరజ సంజీవరాణి కరుణ సునీత సరిత లక్ష్మి సరళ వరలక్ష్మి నాగరాణి సరిత అనిత స్వాతి , ఆలయ నిర్వహకురాలు స్వరూప రమేష్ గారు, ఆలయ అర్చకులు విక్రమ్, వి మాజీ చైర్ పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల రమేష్, డాక్టర్ దీప భక్తవత్సలం, మాజీ జిల్లా అధ్యక్షులు సదానంద రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ గౌడ్, అమరేందర్ రెడ్డి, నర్సింలు, ప్రవీణ్, తదితరులు పాల్గొనడం జరిగింది.

mee seva
easier, faster

ఒక్క మీ సేవతో.. ప్రజలకు చుక్కలు

- మోతెలో రెండో మీ సేవా కేంద్రం లేక రైతులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు
- ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి నిరీక్షణ
- వెంటనే మరో కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్

ప్రజా వాయిస్,మోతె: సూర్యాపేట జిల్లా మోతే మండల కేంద్రంలో ఒకే ఒక్క మీ సేవా కేంద్రం కొనసాగుతుండటంతో రైతులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుల, ఆదాయం, నివాసం, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలతో పాటు ఇతర ఆన్‌లైన్ సేవల కోసం ప్రతిరోజూ వందలాది మంది ఒకే కేంద్రానికి తరలివస్తుండటంతో పనులు రోజుల తరబడి, కొన్ని సందర్భాల్లో వారాల పాటు పెండింగ్‌లో పడుతున్నాయి. దీంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర అవస్థలు పడుతున్నారు.గత ఏడాది మండలంలోని ఓ మీ సేవా కేంద్రంలో లేని భూమికి నకిలీ పత్రాలు సృష్టించిన ఘటన వెలుగులోకి రావడంతో సంబంధిత నిర్వాహకుడితో పాటు పలువురు రైతులు, మండల రెవెన్యూ అధికారులు జైలుపాలయ్యారు. ఆ ఘటన తర్వాత ఆ కేంద్రాన్ని మూసివేయడంతో ప్రస్తుతం మండలంలో ఒకే ఒక్క మీ సేవా కేంద్రం మాత్రమే ప్రజలకు సేవలు అందిస్తోంది.ఒక్క కేంద్రంపై మొత్తం మండల ప్రజల భారం పడటంతో సేవలు సకాలంలో అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు, విద్యార్థులు అత్యవసర ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మోతె మండలానికి వెంటనే మరో మీ సేవా కేంద్రాన్ని మంజూరు చేసి సేవలను వేగవంతం చేయాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు అధికారులను కోరుతున్నారు.

మూత్రశాలలు కంపుగా... కార్యాలయాలు చెత్తగా

- అదికారుల మాటల్లో స్వచ్ఛ భారత్
- చేతల్లో చెత్త రాజ్యం
- సమస్యలపై మీటింగ్
- సమస్యల మద్యే నిర్వహణ
- దోమల పెంపక కేంద్రాలుగా మారిన కార్యాలయాల పరిసరాలు
- గ్రామాలకు కాదు... ముందు మొయినాబాద్ ప్రభుత్వ కార్యాలయాలకే శుభ్రత అవసరం అంటున్న పలువురు సర్పంచులు
- ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరుస్తారా? లేక చెత్త మద్యే పరిపాలన కొనసాగిస్తారా..?
- వేచి చూడాలంటున్న ప్రజలు

చేవెళ్ల (ప్రజావాయిస్): గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి... స్వచ్ఛ భారత్ వైపు అడుగులు వేయాలి అంటూ పరిశుభ్రత పై పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఝులిపించే అధికారులు... తమ కార్యాలయాల ముందు పేరుకుపోయిన చెత్తపై మాత్రం మూగవేషం వేయడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కల్గిస్తోంది . మాటలు మామూలు కాదు... కానీ చేతల్లో మాత్రం పూర్తిగా శూన్యం అంటూ స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు.వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పరిసరాలు చెత్తతో పేరుకుపోయి, దోమల పెంపక కేంద్రాలుగా మారాయి.డీసీపీ కార్యాలయం సహా పలు ప్రభుత్వ విభాగాలు ఉన్న ఈ ప్రాంగణానికి ప్రతిరోజూ వందలో సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. కానీ వారికి ఎదురౌతున్నది సేవల కంటే ముందుగా మురికి, దుర్వాసనే.చెత్తకుప్పలు, ప్లాస్టిక్ బ్యాటిళ్లు, పెరిగిన పిచ్చి మొక్కలు, ఎక్కడికక్కడ నీరు నిల్వలు అన్న ప్రశ్నలు ప్రజల నోట ఉత్పన్నమవుతున్నాయి.గ్రామాల్లో ఉన్న సమస్యలను చర్చించాల్సిన వేదిక... సమస్యల మద్యే నిర్వహించాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది.ఇది అదికారుల నిండు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం అంటూ సమావేశంలో పాల్గొన్న పలువురు సర్పంచులు ప్రజావాయిస్ పత్రికతో చెప్పారు. ప్రజలకోసం ఏర్పాటు చేసిన మూత్రశాలలు పరిశీలిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉందని,దుర్వాసనతో నిండిపోయిందని,వాడుకకు పనికిరాని స్థితికి చేరుకున్నాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది నిర్లక్ష్యమా? లేక బాధ్యతారాహిత్యమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన అధికారులే తమ కార్యాలయాల వద్దే విఫలమైతే, గ్రామాల పరిస్థితి ఎలా మారుతోంది ?అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరుస్తారా ? లేక చెత్త మద్యే పరిపాలన కొనసాగిస్తారా? అన్నది మొయినాబాద్ ప్రజల ప్రశ్నగా మారింది.

మంచి స్థలం' పేరిట నిలువుదోపిడీ!

- బ్రోకర్ల మాయమాటల వలలో విశ్రాంత ఉద్యోగులు
- వరదొస్తే చెరువులే.. కష్టార్జితం నీటిపాలే
- ఏ స్థలం కొన్నా ప్రభుత్వ రికార్డులు, మ్యాప్‌లు పక్కాగా పరిశీలించిన తర్వాతే ముందడుగు వేయండి
- .జనహిత గోదావరిఖని

ప్రజా వాయిస్ గోదావరిఖని పెద్దపల్లి జిల్లా లో ముఖ్యంగా రామగుండం కోల్ బెల్ట్ ఏరియా ఇక్కడ స్థలం కొంటే బంగారం అయిపోతుంది అని దళారులు చెప్పే మాటల వెనుక ఉన్నది నిలువుదోపిడీ అని ఇటీవల కురిసిన వర్షాలు తేటతెల్లం చేశాయి. కష్టపడి దాచుకున్న విశ్రాంతి జీవితపు సొమ్మంతా ప్లాట్లపై పెడితే.. ఒక్క వర్షానికే అదంతా నీటిపాలవుతోంది. చుట్టూ పెద్ద పెద్ద భవనాలు వచ్చాయి.. పక్కనే బడులు ఉన్నాయి.. ఇప్పుడు తీసుకోకపోతే రేపు దొరకదు స్థలం కొనేందుకు వెళ్లే సగటు మధ్యతరగతి ప్రజలకు, రిటైర్డ్ ఉద్యోగులకు దళారులు వేసే వల ఇది. ముఖ్యంగా సింగరేణిలో దశాబ్దాల పాటు భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన రిటైర్డ్ కార్మికులు, ప్రభుత్వంలోని పలు విభాగాల్లో సుదీర్ఘకాలం సేవలు అందించి విశ్రాంతి తీసుకుంటున్న ఉద్యోగులే వీరి ప్రధాన లక్ష్యమవుతున్నారు. తమ జీవితకాల కష్టార్జితాన్ని దళారుల మాయమాటలు నమ్మి కుమ్మరిస్తే, చివరికి నీటిపాలు కావాల్సిందేనని ఇటీవల కురిసిన భారీ వర్షాలు స్పష్టం చేస్తున్నాయి.

కళ్లముందే కన్నీటి గాథలు

ఇటీవల కురిసిన ఒక్క వర్షానికే నగరాలు, శివారు ప్రాంతాల్లోని పలు కాలనీలు చెరువులను తలపించాయి. చెరువులు, కాలువలు, నీటి ప్రవాహ మార్గాలను కప్పేసి కట్టిన ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు నరకయాతన అనుభవించారు. పిల్లల పెళ్లిళ్లు, విశ్రాంతి జీవితం కోసం దాచుకున్న పింఛను, రిటైర్మెంట్ డబ్బులతో కొనుగోలు చేసిన ఆస్తులు కళ్లముందే నీటమునిగిపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయతలో వేలాది కుటుంబాలు గడిపాయి. భవనాలు, ప్రచారాలు చూసి మోసపోకండి. ఏ స్థలం కొన్నా ప్రభుత్వ రికార్డులు, మ్యాప్‌లు పక్కాగా పరిశీలించిన తర్వాతే ముందడుగు వేయండి. జనహిత కోరుకుంటుంది.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో చలకుర్తి చిన్నారుల సత్తా

- మూడు బంగారు, మూడు రజత పతకాలతో గ్రామానికి గర్వకారణం

ప్రజా వాయిస్,నల్గొండ.హైదరాబాద్‌లోని చంపాపేట లక్ష్మీ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన 2వ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్షిప్–2026లో నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన చిన్నారులు ప్రతిభ చాటుతూ పతకాల పంట పండించారు.పాతనబోయిన సుదీక్ష కటాస్ విభాగంలో బంగారు పతకం, కుమితే విభాగంలో రజత పతకం సాధించి ఆకట్టుకుంది. పాతనబోయిన విహాస్ కటాస్, కుమితే విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబర్చి రెండు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. అలాగే పాణ్యం వైభవ్ కటా, కుమితే విభాగాల్లో రెండు రజత పతకాలు సాధించి తన ప్రతిభను చాటాడు.ఈ సందర్భంగా విజేతలు తమ విజయానికి సహకరించిన కోచ్ మహేష్ నాయక్కు కృతజ్ఞతలు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్‌లో మెళకువలు నేర్పిస్తూ, నిరంతరం ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల వేటలో ముందుండేలా తీర్చిదిద్దుతున్న కోచ్ సేవలను వారు కొనియాడారు.ఈ విజయంతో చలకుర్తి గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొనగా, గ్రామస్థులు, క్రీడాభిమానులు విజేతలను అభినందించారు.

జోగిపేటలో ఘనంగా బోనాల జాతర

- జిల్లా వ్యాప్తంగా బోనాల సందడి

ప్రజా వాయిస్ సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా బోనాల పండుగను మహిళలు భక్తి శ్రద్ధలతో సంప్రదాయ పద్ధతిలో బోనం ఎత్తుకొని అమ్మవారికి బోనాన్ని సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. అందులో బాగానే జూపిపెట్ట పట్టణంలో కూడా బోనాల పండుగ నిర్వహించారు.ఆషాడ మాసం సందర్భంగా అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఈరోజు 15వ వార్డులో రజకసంగము ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు తీయడం జరిగింది వర్షాలు బాగా పడాలే పాడిపంటలు బాగా పండాలె రైతులు ప్రతి ఒక్కరి ఇండ్లల్లో ఆనందం వెల్లివిరియలే అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరికి అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకోవడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)ఆత్మ కమిటి డైరెక్టర్ ఖాలేదు, కాంగ్రెస్ లీడర్ సోహెయిల్, చోటు, రమేష్, చెన్నయ్య, గంగని రమేష్, మురళి, రవి, సుబ్బు,చంటి, భరత్, రాజు, రమేష్, శ్రీనివాస్, జోగయ్య, అలాగే రజక సంఘం ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారి బోనాల వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ

- పొట్టేళ్ల బండి ఊరేగింపుతో సందడి చేసిన అప్పాయిపల్లి చిన్నారులు

ప్రజా వాయిస్, దౌల్తాబాద్:దౌల్తాబాద్ మండలం అప్పాయిపల్లి గ్రామంలో శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక ఉత్సాహం నడుమ అత్యంత వైభవంగా సాగాయి. ఈ వేడుకల్లో భాగంగా అప్పాయిపల్లి చిన్నారులు చేపట్టిన పొట్టేళ్ల బండి ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుని వేడుకలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్న వయసులోనే మన గ్రామ సంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకుంటూ చిన్నారులే స్వయంగా పొట్టేళ్ల బండిని తయారు చేసి, భక్తి శ్రద్ధలతో ఊరేగించడం విశేషం.సంప్రదాయ వస్త్రధారణలో ముస్తాబైన చిన్నారులు "జై మహంకాళి అమ్మవారు" అంటూ చేసిన నినాదాలతో గ్రామ వీధులు మారుమోగాయి. ఉత్సాహంగా పొట్టేళ్ల బండిని లాగుతూ బేగంపేటలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయానికి చేరుకున్న చిన్నారులు, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఊరిలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, సమయానికి వర్షాలు కురిసి పశుసంపద వర్ధిల్లాలని, గ్రామంలోని ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు.తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాలను భావి తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతోనే చిన్నారులను ఈ వేడుకల్లో భాగస్వాములను చేస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. మహిళల బోనాలు, డప్పు వాయిద్యాలు, భక్తి గీతాల నడుమ కోలాహలంగా సాగిన ఈ ఊరేగింపును తిలకించేందుకు బేగంపేట, అప్పాయిపల్లి గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సంప్రదాయాల పట్ల చిన్నారులు చూపిన ఉత్సాహాన్ని, భక్తిభావాన్ని గ్రామస్థులందరూ ముక్తకంఠంతో అభినందించారు.

పోతుగల్ గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్ అదుపుతప్పి డివైడర్ చెట్టును ఢీకొట్టిన ఒకరు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలింపు

(ప్రజా వాయిస్ షాబాద్)షాబాద్ మండలం పోతుగల్ గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసుల కథనం ప్రకారం.. చేవెళ్ల మండలానికి చెందిన పుప్పాల నాగేష్ కుమారుడు పుప్పాల చరణ్ (19) బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం చరణ్ తన స్నేహితుడు ఎడ్ల సాతిక్ (19) తో కలిసి TG 07 AK 0140 నంబర్ గల ద్విచక్రవాహనంపై షాబాద్ వైపు నుంచి చేవెళ్ల వైపు వెళ్తున్నారు.ఈ క్రమంలో పోతుగల్ గ్రామ సమీపంలోకి రాగానే మోటార్‌సైకిల్ తీవ్ర అతివేగంతో అదుపుతప్పి నడిరోడ్డులోని డివైడర్‌పై ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన పుప్పాల చరణ్ రక్తమడుగులో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు బైక్ వెనుక కూర్చున్న ఎడ్ల సాతిక్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు షాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు ఉదయించే వయసులోనే బీటెక్ విద్యార్థి ప్రాణాలు కోల్పోవడంతో చేవెళ్లలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మన్మోహన్ గౌడ్

- 25 ఏళ్ల నిరీక్షణకు తెర
- సుద్దోడ్కా తండాకు రహదారి పనుల ప్రారంభం

ప్రజావాయిస్ / మోమిన్‌పేట్: టేకులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సుద్దోడ్కా తండాకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ నాయకుడు సింగితం మన్మోహన్ గౌడ్ ఆదివారం సొంత నిధులతో సుమారు అర కిలో మీటర్ ఫారెమేషన్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా తండా ప్రజలు, రైతులు, విద్యార్థులు రహదారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దళిత రైతులు స్వచ్ఛందంగా భూమిని రహదారి కోసం ఇవ్వగా, వారికి ప్రత్యామ్నాయంగా భూమి అందించేలా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారని చెప్పారు.ఈ రహదారి నిర్మాణంతో తండా ప్రజలకు టేకులపల్లి గ్రామానికి రాకపోకలు సులభతరం అవుతాయని, ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, రైతులు, గ్రామస్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి వచ్చినా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తన బాధ్యతగా భావించానని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని మన్మోహన్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, తండా ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనక బుచ్చిరాంకు ఘనంగా వీడ్కోలు సన్మానం

- ఏసీఎంఓ పూర్కా ఉద్దవ్

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని కేఆర్‌కే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎస్‌సీఆర్‌పీ కంచనపల్లి కనక బుచ్చిరాం పదవీ విరమణ సన్మాన సభ జరిగింది. కార్యక్రమంలో ఏసీఎంఓ పూర్కా ఉద్దవ్, టీఎస్టీడబ్ల్యూటీయూ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్ పాల్గొని కనక బుచ్చిరాంను సన్మానించారు.కనక బుచ్చిరాం సుదీర్ఘ సేవా కాలంలో గిరిజన విద్యార్థుల అభివృద్ధి, గిరిజన సమాజ సంక్షేమం కోసం కృషి చేశారని, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల అమలు, పీఎం జన్‌మన్, పీఎం జూగా వంటి పథకాల అమలులో విశేష పాత్ర పోషించారని పూర్కా ఉద్దవ్ తెలిపారు.మారుమూల గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలు, మౌలిక వసతులపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, వాస్తవ నివేదికలు అందించడంలో కనక బుచ్చిరాం చూపిన నిజాయితీ, బాధ్యత ఆదర్శనీయమని రాథోడ్ రవీందర్ పేర్కొన్నారు. క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధతతో పనిచేసిన కనక బుచ్చిరాం పదవీ విరమణతో శాఖ అనుభవజ్ఞుడైన అధికారిని కోల్పోతుందని, పదవీ విరమణ అనంతరం సమాజ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీఎస్టీడబ్ల్యూటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడావి గోపాల్, కోశాధికారి కూడ్మేత అనంత్, కార్యదర్శులు కోర్వేత మనోహర్, మాడావి లచ్చు, షెడ్మాకీ వెంకటేశం, మాడావి శ్యాంరావ్ తదితరులు పాల్గొన్నారు.

వదల బొమ్మాలి నేను వదలా!?

- నిబంధన ప్రకారం బదిలీ అయిన రికమండేషన్ తో మరల స్థానచలనం!
- పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఐదు నుండి ఎనిమిది సంవత్సరాల వరకు విధి నిర్వహణలు!
- ఒకే చాట ఏళ్ల తరబడి విధి నిర్వహణ ఎలా సాధ్యమంటూ సామాన్యుల ప్రశ్న?
- మండలమే కాదు నియోజకవర్గం కూడా ఇదే పరిస్థితి అంటూ సీనియర్ సిటిజన్ మండిపాటు?
- చట్టాలు కొందరికే తప్ప అందరు వర్తించమంటూ సీనియార్టీ గా విధులు నిర్వహిస్తున్న వారికి చుక్కెదురు?

ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం అశ్వారావుపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలలో వివిధ రకాల ఉద్యోగస్తులు విధి నిర్వహణలో భాగంగా బదిలీ అయినప్పటికీ మరల రాజకీయ పలుకుబడిన ఉపయోగించి ఒకేచట 5 నుండి 8 సంవత్సరాల వరకు విధి నిర్వహణ కొనసాగించటం నియోజకవర్గం ప్రజల ప్రశ్న! కొందరు అధికారులు మాత్రం చట్టాలు కొందరికే తప్ప అందరుకు వర్తించవని రాజకీయం బంధుత్వం, స్నేహబలం. వంటి వాటికి ఉద్యోగ విధి నిర్వహణ సైతం తాకట్టు పెడుతున్నారని అందువల్లనే బదిలీ అయిన వెనివెంటనే మరలా అట్టి ప్రదేశంలో విధి నిర్వహణలో కొనసాగించడం సర్వసాధారణమైనట్లు తెలుస్తుంది. ఒక్క మండలంలోని కాకుండా నియోజకవర్గం లో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయంలో వివిధ రకాల ఉద్యోగస్తులు బదిలీలు అయినప్పటికీ వెళ్లేందుకు నిరాకరించి రికమండేషన్ ద్వారా అటువంటి బదిలీ కార్యక్రమాన్ని నిలుపుదల చేయడమే కాకుండా కొందరైతే ప్రమోషన్లను సైతం తెప్పించుకొని ఉన్న చాటే కదలకుండా విధి నిర్వహణలో నిర్వహిస్తున్న ఘటనలు లేకపోలేదు. నిజానికి ప్రభుత్వ నిబంధనలో భాగంగా ఉద్యోగరీత్యా లో కిందిస్థాయి నుండి పై స్థాయి వరకు ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ పదవి ఉన్నతాధికారులుగా ఎదగటం ఒక భాగం అయితే పరీక్ష పోటీల్లో నెగ్గి ఉత్తీర్ణశాతం తెచ్చుకొని ప్రమోషన్ రూపంలో వెళ్ళటం ఒక భాగం కానీ అశ్వారావుపేట నియోజకవర్గం లోని పలు ప్రభుత్వ కార్యాలయంలో కొందరు అధికారులు మాత్రం రాస మార్గాలను ఎన్నుకొని ప్రమోషన్లను సాధించుకోవడం సర్వసాధారణమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లోని దమ్మపేట, ములకలపల్లి ,చంద్రుగొండ, అన్నపరెడ్డిపల్లి ,అశ్వరావుపేట. వంటి మండలాలలో రెవెన్యూ, విద్య, ఆరోగ్య, ఎక్సైజ్, పోలీస్, ఫారెస్ట్. శాఖలే కాకుండా ఆయా కార్యాలయాల్లో పనిచేస్తున్న పలు అధికారులు సైతం బదిలీ అయినప్పటికీ వెళ్ళటం ఇష్టం లేక స్థానికంగానే ఉండటం కోసం రాజకీయ, స్నేహ, అధికారా. వంటి బలాలను వినియోగించి ఉండటంతో ప్రజలకు కొంత ఇబ్బందులు గురవుతున్నాయని సీనియర్ రిటర్మెంట్ ఉద్యోగస్తులు సైతం మండిపడుతున్నారు.

ఒకే చోట ఐదు నుండి ఎనిమిది సంవత్సరాల వరకు విధి నిర్వహణలె!?

మండలమే కాకుండా నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులు నిబంధన ప్రకారం మూడు సంవత్సరాల విధినిర్వహణలో బదిలీలు జరగటం ఒక భాగం అయితే ప్రమోషన్ తో పాటు సాధారణ బదిలీలు గాని రాజకీయ నాయకుల ప్రోత్సాహంతో బదిలీలు జరిగే సంఘటనలు సర్వసాధన కానీ అశ్వారావుపేట నియోజకవర్గం లోని పలు ప్రభుత్వ కార్యాలయంలో బదిలీలు అయినప్పటికీ అధికారులు మాత్రం వదలబమ్మాలి నిన్ను వదల అంటూ దిష్టి వేస్తూ ఆధిపత్యం చాలా ఇస్తున్నారు. అన్న వాదన లేకపోలేదు.

నియోజకవర్గంలోని ఎక్కువగా రాజకీయ నాయకుల కొనసాగిల్లోనే అధికారం!

నియోజకవర్గంలో పలు ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న వందల కొద్ది ఉద్యోగస్తులు తమ విధి నిర్వహణలో తప్పులు దొర్లిన వెంటనే రాజకీయ నాయకులను సంప్రదించి వారి ద్వారా పై స్థాయి అధికారులకు నచ్చ చెప్పే విధంగా పాములు కదుపుతున్నారంటే రాజకీయ నాయకుల చేతుల్లోనే అధికార యంత్రాంగం పనిచేస్తుందన్న మాట నూటికి నూరు శాతం ఒప్పుకొని తీరాల్సిందే! అంతేకాకుండా అధికారులకు కావలసిన చోట బదిలీలు కావాలన్నా నాయకత్వాన్ని సంప్రదించాల్సిందే! వారు చెప్పింది మీరు చేయటం వీరు చెప్పింది వారు చేయటం వంటి పనులు జరగటంతో సామాన్య ప్రజలకు మాత్రం న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదని అంతే కాకుండా పలు ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న నిజాయితీ గల అధికారులు సైతం వారిని ఎదురికిచ్చి విధినిర్వాహన కొనసాగించలేని పరిస్థితి సైతం ఏర్పడుతుందని రిటర్మెంట్ ఉద్యోగస్తులు సైతం ఒప్పుకోవటం ఓ సంచలనమే!? ఏది ఏమైనా అశ్వారావుపేట నియోజకవర్గం లోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు బదిలీలు ఉన్న వెళ్లే పరిస్థితి లేక శిలాఫలకం లాగా కదలకుండా ఉండేందుకు పాములు కదుపుతూ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై ఉన్నతాధికార యంత్రాంగం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి మరి!

ప్రాణాలు తీస్తున్న బైపాస్.. ఫ్లైఓవర్ల నిర్మాణం ఎప్పుడు

- వరుస ప్రమాదాలతో ఉగ్రరూపం దాల్చిన చింతపల్లి-అద్దంకి బైపాస్
- ఫ్లైఓవర్ నిర్మించాలని సీపీఎం, గ్రామస్థుల ధర్నా

మిర్యాలగూడ,ప్రజా వాయిస్: మిర్యాలగూడ పట్టణ సమీపంలోని చింతపల్లి–అద్దంకి బైపాస్ రోడ్డుపై వరుస రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో వెంటనే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి రవి నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం చింతపల్లి బైపాస్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన రవి నాయక్, రామతండా గ్రామస్థులతో కలిసి బైపాస్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ప్రమాదాలకు శాశ్వత పరిష్కారంగా ఫ్లైఓవర్ నిర్మాణమే మార్గమని వారు స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు.ఇకనైనా ప్రమాదాల తీవ్రతను గుర్తించి చింతపల్లి–అద్దంకి బైపాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని, లేకుంటే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామస్థులు కూడా ప్రమాదకరంగా మారిన ఈ జంక్షన్ వద్ద శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

వెల్గి గ్రామానికి వంతెన ఎప్పుడు

- వాగు దాటడమే పెద్ద సవాలు

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం వెల్గి గ్రామపంచాయతీ పరిధిలోని ఒర్రెవాగుపై శాశ్వత వంతెన లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలకు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సి వస్తోంది. వెల్గితో పాటు పరిసర గ్రామాలకు ఇదే మార్గం కీలక అనుసంధానం కావడంతో నిత్యం వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షం కురిసిన ప్రతిసారి గంటల తరబడి, కొన్నిసార్లు రోజంతా రాకపోకలు నిలిచిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు.వాగు ఉప్పొంగినప్పుడు పంట దిగుబడులను మార్కెట్‌కు తరలించలేక రైతులు నష్టపోతున్నారు. విత్తనాలు, ఎరువులు సకాలంలో అందక వ్యవసాయ పనులు ఆలస్యమవుతున్నాయి. వర్షం రోజుల్లో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక హాజరు కోల్పోతున్నారు. రోగులు, గర్భిణీలను ఆస్పత్రులకు తరలించే సమయంలో అంబులెన్స్‌లు వాగు దాటలేని పరిస్థితి ఏర్పడి అత్యవసర వైద్య సేవలు ఆలస్యమవుతున్నాయి.వంతెన నిర్మాణానికి నిధులు ఇప్పటికే మంజూరైనప్పటికీ సంబంధిత శాఖల నిర్లక్ష్యంతో పనులు ప్రారంభం కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా అమలుకు నోచుకోలేదని విమర్శిస్తున్నారు. వర్షాలు మరింత పెరిగితే వెల్గి గ్రామం పూర్తిగా ఒంటరిగా మారే ప్రమాదం ఉందని, పోలీసు, వైద్య, అగ్నిమాపక సేవలు కూడా చేరుకోలేని పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కలెక్టర్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఒర్రెవాగు వద్ద పరిస్థితిని పరిశీలించాలని, మంజూరైన నిధులతో పెండింగ్‌లో ఉన్న వంతెన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని గ్రామస్తులు, రైతులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

మజీద్ కమిటీ చైర్మన్ మతీన్ కు సంపూర్ణ సహకారం అందిస్తా

- సత్కరించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

ప్రజా వాయిస్, గజ్వేల్ :ప్రతిష్టాత్మకంగా జరిగిన గజ్వేల్ తంజిముల్ మజీద్ కమిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేత సయ్యద్ మతిన్ రెండవసారి విజయం సాధించడం పట్ల గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. విజయోత్సవ ర్యాలీలో పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపిన సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడారు. గజ్వేల్ మైనార్టీల అభ్యున్నతికి శ్రమిస్తున్న మతిన్ కు తన సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. గజ్వేల్ పట్టణంలో తన కుడి భుజం, సోదరుడు మతీన్ గెలుపొందడం ఎంతో సంతృప్తి కలిగిస్తుండగా, తన గెలుపుగా భావిస్తున్నట్లు చెప్పారు. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి నాయిని యాదగిరి, నేతలు సమీర్, గుంటకు శ్రీనివాస్, రాములు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి తదితరులు సయ్యద్ మతీన్ ను అభినందించి సత్కరించారు.

ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను..!



- అధికారుల నిర్లక్ష్యమే అండగా మారిందా..?
- ఫెన్సింగ్ లేకుండా చేతులు దులుపుకున్న రెవెన్యూ అధికారులు..?
- సర్వే నెం.42లో మళ్లీ ఆక్రమణ యత్నాలపై స్థానికుల మండిపాటు

రాజేంద్రనగర్,ఆగస్టు02(ప్రజావాయిస్) నార్సింగి సర్కిల్ మణికొండ జాగీర్ పంచవటి కాలనీలోని సర్వే నెం.42లో ఉన్న సుమారు 450 గజాల స్థలంపై మరోసారి కబ్జాదారుల కన్ను పడిందని ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.అక్రమ ఆక్రమణలను తొలగించిన తర్వాత కూడా భూమికి శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేయకుండా కేవలం బోర్డు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని కొందరు భూకబ్జాదారులు మరోసారి ప్రభుత్వ భూమిపై కన్నేశారని,దీంతో ప్రజా ఆస్తి ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ భూమిని పరిరక్షించాల్సిన రెవెన్యూ,సంబంధిత శాఖల అధికారులు తమ బాధ్యతలను విస్మరించారా.? అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపి,భూమి పరిరక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొని,భూమికి శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాదారుల ఖబంధ హస్తాల్లో బంధీ కానుందని అక్కడి ప్రజలు హెచ్చరిస్తున్నారు.

కట్ట మైసమ్మ వద్ద ఎదురెదురు బైక్‌లు ఢీ

- ఇద్దరి పరిస్థితి విషమం..
- ఆసుపత్రికి తరలింపు

ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట: మండలంలోని కట్ట మైసమ్మ ఆలయం సమీపంలో గురు గురుపతి గుట్ట దగ్గర ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శంకరంపేట–ఎకు చెందిన లోధ రవి (38), మల్కాపూర్ గట్టు కింది తండాకు చెందిన మునోత్ జైపాల్ (33) తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, ఘటనకు సంబంధించిన ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.

చిరుధాన్యాల ఉద్యోగి చిట్టిల పేరుతో ఘరానా మోసం

- బుద్వేల్ గ్రామంలో కలకలం
- రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసి పరారైన అశోక్
- రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదల కష్టార్జితం స్వాహా.!
- అశోక్ ఇంటివద్ద ఆందోళనకు దిగిన బాధితులు
- తమకు న్యాయం చేయాలని బోరున విలపించిన మహిళలు


అశోక్ ఇంటివద్ద ఆందోళనకు దిగిన బాధితులు

పరారిలో ఉన్న నిందితుడు అశోక్...

తన చెల్లి పెళ్లికోసం రూ.6 లక్షల చొప్పున 3 చిట్టీలు వేసిన అని చెపుతున్న మహిళ

రాజేంద్రనగర్,ఆగస్టు 02 (ప్రజావాయిస్)నమ్మిన వారిని నట్టేట ముంచుతూ, ప్రభుత్వ పరిశోధనా సంస్థలోని ఉద్యోగ హోదాను అడ్డం పెట్టుకుని కోట్ల రూపాయల చిట్టీల మోసానికి పాల్పడిన ఘరానా దంపతుల ఉదంతం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ గ్రామంలో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. స్థానికుల నుంచి,తోటి ఉద్యోగుల నుంచి పక్కా ప్రణాళిక ప్రకారం భారీ ఎత్తున నగదు వసూలు చేసిన అశోక్ అనే వ్యక్తి, రాత్రికి రాత్రే ఇంటికి తాళాలు వేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు.

ఉద్యోగం వెనుక 'మోసపూరిత'వ్యూహం.!

రాజేంద్రనగర్‌లోని,నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ సోర్గమ్ (ప్రస్తుతం భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ – ఐసిఏఆర్, ఐఐఎంఆర్)లో పనిచేస్తున్న అశోక్,స్థానికంగా బిల్డింగ్ మెటీరియల్ సరఫరా చేసే వ్యాపారాన్ని కూడా నడుపుతున్నాడు.జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థలో ఉద్యోగం,మరోవైపు పెద్ద వ్యాపారం ఉండటంతో స్థానికులు,పరిచయస్తులు అతని మాటలను గుడ్డిగా నమ్మారు.చిట్టీలు వేస్తే, అలాగే అధిక వడ్డీ ఆశచూపడంతో,అతడి ఉద్యోగ హోదాను చూసి పలువురు నిరుపేదలు,వీధి వ్యాపారులు,తోటి ఉద్యోగులు తమ కష్టార్జితాన్ని అశోక్ చేతిలో పెట్టారు.తీరా చిట్టీల గడువు ముగిసి,అసలు డబ్బులు చెల్లించాల్సిన సమయం రావడంతో అశోక్ దంపతులు వాయిదాల పేరుతో కాలయాపన చేస్తూ వచ్చారు.బాధితుల నుంచి ఒత్తిడి పెరగడంతో పక్కా స్కెచ్ ప్రకారం రాత్రికి రాత్రే కట్టుబట్టలతో బోర్డు తిప్పేసి జెండా ఎత్తేశారు.

బాధితుల గుండెకోత - కన్నీటి పర్యంతం

రోడ్డు పక్కన రొట్టెలు అమ్ముకుంటు కుటుంబాన్ని పోషిస్తున్నాను.నా బతుకును రోడ్డున పడేసిండు.కరోనా మహమ్మారికి నా భర్త బలైపోయాడు.పిల్లలను పోషించుకోవడానికి రోడ్డు పక్కన రొట్టెలు అమ్ముకుంటూ రూపాయి రూపాయి కూడబెట్టాను.నా కష్టార్జితం రూ.5 లక్షలు చిట్టి అశోక్ దగ్గర వేశాను.ఆ డబ్బులతో కుటుంబాన్ని నిలబెట్టుకుందామనుకుంటేఇప్పుడు నన్ను,నా పిల్లలను నడిరోడ్డున పడేసి వెళ్ళిపోయాడు.నా డబ్బులు నాకు ఇప్పించకపోతే అశోక్ ఇంటివద్దే నా పిల్లలతో ఆత్మహత్య చేసుకుంటాననిఓ నిరుపేద మహిళ లబోదిబోమంటూ విలపించింది.

చెల్లి పెళ్లి కోసం దాచిన సొమ్ము పాయె

ఒకే చోట పనిచేస్తున్నామన్న నమ్మకంతో రూ.6 లక్షల చొప్పున మూడు చిట్టీలు వేశాను.చిట్టి డబ్బులు ఇస్తానని ఇంటికి రమ్మని పిలిచి,తీరా వెళ్లేసరికి ముఖం చాటేశాడు.ఇంటి వద్ద ఉన్న అతని భార్యను నిలదీస్తే,నాకు చెప్పి చిట్టీలు వేశావా.?నాకేం సంబంధం లేదని బెదిరింపులకు దిగింది.చెల్లి పెళ్లి కోసం దాచుకున్న రూపాయి రూపాయి ఆవిరైపోయిందని మరొక బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే - బాధితులపైనే ఫిర్యాదు.!

కోట్ల రూపాయలు ఎగ్గొట్టి పారిపోవడమే కాకుండా, బాధితులకు మైండ్ బ్లాక్ అయ్యేలా అశోక్ దంపతులు కొత్త నాటకానికి తెరతీశారు.తమను వేధిస్తున్నారంటూ బాధితులపైనే సీసీఎస్,లో ఫిర్యాదు చేయడం గమనార్హం.సీసీఎస్ నుంచి సుమారు 45 మంది బాధితులకు నోటీసులు రావడంతో తీవ్ర విస్మయానికి గురైన బాధితులంతా ఆగ్రహంతో అశోక్ నివాసం ముట్టడించి, ఆందోళన చేపట్టారు.వెలుగులోకి రాని బాధితులు ఇంకా ఎంతమంది ఉన్నారోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి అశోక్ దంపతులపై కఠిన చర్యలు తీసుకుని,తమ కష్టార్జితాన్ని తిరిగి ఇప్పించాలని బాధితులు వేడుకుంటున్నారు.

రోడ్డు పక్కన రొట్టెలు అమ్ముకుంటూ కూడబెట్టిన సొమ్ము ఇప్పించండని విలపిస్తున్న మహిళ

నూతన మండల అధ్యక్షుడికి గౌడ సంఘం ఘన సన్మానం

- గుండు నరేందర్ గౌడ్ ను సత్కరించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.
- పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచన

ప్రజా వాయిస్,మిర్యాలగూడ.మిర్యాలగూడ పట్టణంలోని గౌడ సంఘం భవనంలో మిర్యాలగూడ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన గుండు నరేందర్ గౌడ్‌కు ఆదివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) గుండు నరేందర్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.అన్ని సామాజిక వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలని నరేందర్ గౌడ్‌కు సూచించారు.నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని గుండు నరేందర్ గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గౌడ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా సేవ కొనసాగిస్తా!!

- జర్నలిస్ట్ సెనగ మల్లేష్ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం
- సామాజిక చైతన్యానికి కలాన్ని అంకితం చేసిన జర్నలిస్టు
- చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కారం

ప్రజా వాయిస్ బూర్గుంపాడు సమాజంలో జరుగుతున్న నేరాలు, సామాజిక సమస్యలు, కుటుంబ విలువలు, యువత భవిష్యత్తు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళల భద్రత, ప్రజల హక్కులు, బాధ్యతలు వంటి కీలక అంశాలపై చైతన్యవంతమైన కథనాలు, ఆలోచన రేకెత్తించే వ్యాసాలు రాస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న ప్రముఖ విలేకరి సెనగ మల్లేష్కు ఆదివారం ఘన సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, వార్తలను కేవలం ప్రచురించడానికే పరిమితం కాకుండా సమాజంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తూ, యువతలో బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించేలా ఆయన రచనలు కొనసాగిస్తున్నారని కొనియాడారు. మాదకద్రవ్యాల వ్యసనం, మహిళల భద్రత, కుటుంబ బంధాల పరిరక్షణ, గ్రామీణ సమస్యలు, సామాజిక విలువల క్షీణత వంటి అంశాలపై ఆయన రాసే కథనాలు ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ అవసరమైన వారికి అండగా నిలుస్తున్నారని వక్తలు ప్రశంసించారు. నిజాయితీ, నిబద్ధత, సేవా భావంతో జర్నలిజాన్ని కొనసాగిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న సెనగ మల్లేష్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.కేవీ సార్ మాట్లాడుతూ, సమాజానికి మేలు చేసే వార్తలే నిజమైన జర్నలిజానికి నిదర్శనమని అన్నారు. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ చైతన్యాన్ని పెంపొందిస్తున్న సెనగ మల్లేష్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.చేయూత ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మి నారాయణ రెడ్డి మాట్లాడుతూ, సమాజ సేవకు కలం కూడా ఒక శక్తివంతమైన ఆయుధమని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందిస్తూ, సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సహకరిస్తున్న సెనగ మల్లేష్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.ఆదర్శ రైతు నర్సిరెడ్డి మాట్లాడుతూ, రైతుల సమస్యలు, గ్రామీణ ప్రజల కష్టాలు, సామాన్యుల ఆవేదనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో సెనగ మల్లేష్ పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. ప్రజల పక్షాన నిలిచే జర్నలిస్టులు సమాజానికి ఎంతో అవసరమన్నారు.మెండి భాస్కర్ మాట్లాడుతూ, నిజాయితీతో ప్రజా సమస్యలపై రాజీ పడకుండా వార్తలు రాస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకున్న వ్యక్తి సెనగ మల్లేష్ అని అన్నారు. యువతకు స్ఫూర్తినిచ్చే వ్యాసాలు, సమాజాన్ని ఆలోచింపజేసే కథనాలు ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సెనగ మల్లేష్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.సన్మానానికి స్పందించిన సెనగ మల్లేష్, ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా ప్రజల గొంతుకగా నిలిచి సమాజ హితం కోసం నిష్పక్షపాతంగా కలం పట్టి సేవ చేస్తానని తెలిపారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చేయూత ట్రస్ట్ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

భూ పోరాటం ఆపం... ఇంకా ఉధృతం చేస్తాం

- పొద్దుటూరులో దళిత రైతుల భూ పోరాటం మళ్లీ రగులుతోంది
- మోసం చేసి భూములు లాక్కున్నారు
- 360ఎకరాల భూమిపై సమగ్ర విచారణకు డిమాండ్
- ఎన్.హెచ్.ఆర్.సీ నివేదికపై అనుమానాలు
- ఓఆర్సీల జారిపై భారీ స్కామ్ ఆరోపణలు
- అధికారుల మౌనం... రైతుల అగ్రహానికి ఇందనం
- అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతున్న రైతులు
- త్వరలోనే ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా..
- రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలంటూ రైతులకు మద్దతుగా ట్రెసా

చేవెళ్ల (ప్రజావాయిస్):రంగారెడ్డి జిల్లా శంకర్పల్లిలోని పొద్దుటూరు గ్రామంలో దళిత రైతుల భూ పోరాటం మళ్లీ అగ్గిరాజేస్తోంది. "భూ పోరాటం ఆపం... ఇంకా ఉధృతం చేస్తాం" అంటూ ఆదివారం రైతులు గట్టిగా హెచ్చరిస్తూ ఉద్యమాన్ని మరింత వేడెక్కిస్తున్నారు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్న తమ భూములను మోసం చేసి లాక్కున్నారని ఆరోపిస్తూ బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మా చెమటతో పండించిన నేలను దోచుకున్నారు... ఇది అన్యాయం కాదు, నేరం అంటూ రైతులు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా 360 ఎకరాల భూమిపై సమగ్ర విచారణ జరిపాలని... సర్వేనెంబర్లు240,241,249 లో అసలు నిజాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఇక ఎన్‌హెచ్ఆర్‌సీ నివేదికపై కూడా రైతులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయి విచారణ లేకుండానే నివేదిక ఇచ్చారని ఆరోపిస్తూ, సర్వే నంబర్లకు సంబంధించిన ఓఆర్సీల జారీపై భారీ స్కామ్ జరిగిందని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.అధికారుల మౌనం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "న్యాయం కోసం తలుపులు తట్టినా స్పందన లేదు... అందుకే ఇప్పుడు రోడ్డెక్కాల్సి వస్తోంది" అంటూ వారు స్పష్టం చేస్తున్నారు. ఈ మౌనం రైతుల ఆగ్రహానికి మరింత ఇంధనంగా మారుతోంది.ఇక పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించిన రైతులు... త్వరలోనే హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇక మాటలు కాదు... యాక్షన్ కావాలి అంటూ ప్రభుత్వానికి స్పష్టమైన సందేశం ఇస్తున్నారు.ఈ భూ వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దళిత రైతులకు న్యాయం చేయాలని ట్రెసా కూడా మద్దతుగా నిలుస్తున్నారు. బాధితులకు అండగా నిలుస్తామని తెలంగాణ రియల్ ఎస్టేట్ సఫరర్స్ అసోసియేషన్(ట్రెసా) అధ్యక్షుడు కొల్లూరి శ్రీనివాస్ రావ్ ప్రకటించారు.

బోనాల వేళ పారిశుద్ధ్యం గాలికొదిలేసిన జీహెచ్ఎంసీ..!

- హిమగిరి నగర్-ఫీల్ గుడ్ హోమ్స్ కూడలిలో రెండు నెలలుగా రోడ్డుపై మురుగునీరు
- భక్తుల ఇబ్బందులు పట్టించుకోని శానిటేషన్ అధికారులపై స్థానికుల మండిపాటు

రాజేంద్రనగర్,ఆగస్టు 02 (ప్రజావాయిస్)బోనాల పండుగ సందర్భంగా దేవాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ, కాలనీల్లో నెలకొన్న మురుగునీటి సమస్యలను మాత్రం పూర్తిగా విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని హిమగిరి నగర్ కాలనీ,ఫీల్ గుడ్ హోమ్స్ ప్రధాన కూడలిలో గత రెండు నెలలుగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా సంబంధిత శానిటేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.బోనాలు సమర్పించేందుకు మహిళలు వెళ్లే ప్రధాన మార్గమే మురుగునీటితో నిండిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.మురుగు నీటిలో నడుచుకుంటూ అమ్మవారికి బోనాలు సమర్పించాలా.? అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు.పండుగ ఏర్పాట్లతో పాటు ప్రజారోగ్యం,పారిశుద్ధ్యానికి సంబంధించిన సమస్యలపై కూడా అధికారులు దృష్టి సారించాలని,హిమగిరి నగర్ ప్రాంతంలో నెలకొన్న మురుగునీటి సమస్యను వెంటనే శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బూరుగుపల్లిలో ఘనంగా ఆషాఢ బోనాల వేడుకలు

- శ్రీ కోటమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి
- ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించిన ఎమ్మెల్యే
- తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రతీక అని వ్యాఖ్య

ప్రజా వాయిస్, శంకరంపేట: శంకరంపేట మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ కోటమ్మ తల్లి ఆలయంలో ఆదివారం బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పంటలు బాగా పండాలని, నియోజకవర్గ ప్రజలందరిపై శ్రీ కోటమ్మ తల్లి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.గ్రామాల్లో భక్తి, ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాసిపేటలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ మెరుపుదాడి

ప్రజా వాయిస్ కాసిపేట :
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలములో నార్కోటిక్ బృందం మరియు /టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యములో కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం గ్రామంలోని ఓ ఇంటిలో నగదును పందెంగా పెట్టి పేకాట నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న ప్రత్యేక పోలీసు బృందాలు . 02-08-2026 అర్ధరాత్రి సమయంలో పోలీసులు అక్కడికి చేరుకుని మెరుపుదాడి నిర్వహించారు.ఈ దాడిలో నగదు మరియు పందేలు నిర్వహిస్తూ పేకాట ఆడుతున్న ఐదు గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.1,10,630 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు,వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం కాసిపేట పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినా లేదా జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా రామగుండం పోలీస్ కమిషనరేట్ నార్కోటిక్ బృందం/టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

న్యూస్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు

- ఆప్యాయత, అనుబంధాలకు ప్రతీక స్నేహం
- బానోత్ హనుమంతు నాయక్

ప్రజా వాయిస్ హుస్నాబాద్ :

న్యూస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలను ఎంతో వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. న్యూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బానోత్ హనుమంతు నాయక్ కేక్ కట్ చేసి సభ్యులందరికీ ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో ఎలాంటి స్వార్థం లేకుండా లభించే ఒకే ఒక్క పవిత్రమైన బంధం స్నేహమని కొనియాడారు. కష్టసుఖాల్లో తోడుగా నిలిచే మంచి మిత్రులు లభించడం పూర్వజన్మ సుకృతమని, వయసు, అంతస్తులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి జీవిత ప్రయాణంలో స్నేహం తీపి జ్ఞాపకాలను అందిస్తుందని అన్నారు. సమాజంలో పత్రికా రంగానికి చెందిన విలేకరులు నిరంతరం పని ఒత్తిడిలో ఉంటారని, ఇలాంటి వేడుకలు వారి మధ్య మరింత ఐక్యతను, ఆత్మీయతను పెంచుతాయని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా కలసిమెలసి ఉంటూ సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. న్యూస్ క్లబ్ నిర్వాహకులు ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు.

ఐదు రోజుల ఉపాధ్యాయ శిక్షణ ప్రారంభం

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ :

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 3 నుంచి 7 వరకు ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ & ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గణిత, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ బోధిస్తున్న ఉపాధ్యాయుల కోసం ఐటిడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు రెండో విడతగా ఈ శిక్షణ చేపడుతున్నారు.
సబ్జెక్టు నిపుణులు, డిఆర్పిల ద్వారా బోధనా నైపుణ్యాల మెరుగుదల, సామర్థ్యాధారిత బోధన, అభ్యసన ఫలితాల సాధన, వినూత్న బోధనా పద్ధతులు, తరగతి గది నిర్వహణ, మూల్యాంకన విధానాలు, విద్యార్థి-కేంద్రీకృత బోధన అంశాలపై శిక్షణ ఇస్తారు.
శిక్షణకు హాజరుకావాల్సిన ఉపాధ్యాయులంతా సోమవారం ఉదయం 9 గంటలకు శిక్షణా కేంద్రానికి చేరుకుని రిపోర్ట్ చేయాలని, ఐదు రోజులూ పూర్తిగా హాజరై సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి. ఉద్ధవ్ కోరారు.

నేరాల నియంత్రణకు నిఘా

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా
- వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పోలీసుల స్పెషల్ డ్రైవ్
- ఇవ్వండి, వివరాలు గోప్యంగా ఉంచుతాం విజ్ఞప్తి చేసిన ఎస్పీ

ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:
వికారాబాద్ జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్-డివిజన్ల పరిధిలోని సమస్యాత్మక, ఏకాంత ప్రాంతాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాల్లో పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. సమాజానికి ముఖ్యంగా యువత భవిష్యత్తుకు ముప్పుగా మారుతున్న గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, నిల్వ, వినియోగంపై వికారాబాద్ జిల్లా పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల సరఫరాదారులు, విక్రేతలు, వినియోగదారులపై నిరంతరం నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వికారాబాద్, తాండూరు, పరిగి సబ్-డివిజన్లలో నార్కోటిక్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులను తనిఖీ చేయడంతో పాటు ఫుట్ పెట్రోలింగ్, వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ప్రజలు, విద్యార్థులు, ప్రయాణికులకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా దొంగతనాలు, అక్రమ కార్యకలాపాలు, రాత్రి వేళల్లో జరిగే నేరాలను అరికట్టేందుకు సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు మరియు అనుమానితుల తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు.గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, వినియోగం, దొంగతనాలు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మత్తు రహిత, నేర రహిత వికారాబాద్ నిర్మాణంలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, తాండూరు డీఎస్పీ యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐటీడీఏ వసతి గృహ విద్యార్థులు

ఎన్ఎస్‌యూఐ నాయకుల పరామర్శ

ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్:
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) వసతి గృహంలో విద్యార్థులకు అందించిన ఆహారం వికటించడంతో దాదాపు 12 మంది విద్యార్థులు వాంతులు. విరోచనాలకు గురై, బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, ఎన్ఎస్‌యూఐ బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చిలుముల సాయి కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆసుపత్రికి వెళ్లి బాధిత విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను కోరారు. అలాగే వసతి గృహంలో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతపై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు కోరారు.

సామాజిక న్యాయం తెలంగాణ రక్షణ సేన లక్ష్యం

- ఆగస్టు 6న రాష్ట్రస్థాయి సంకల్ప సభ
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ రక్షణ సేన సదస్సు
- ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నిర్వహణ
- రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలిరావాలని పిలుపు

ప్రజా వాయిస్, గజ్వేల్ :
తెలంగాణలో సామాజిక న్యాయం, అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఈ నెల 6న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. ఆదివారం గజ్వేల్ లో సదస్సు పోస్టర్ ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని ఈ సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం ఆశించిన స్థాయిలో సామాజిక న్యాయం జరగలేదని, సమాజంలోని ప్రతి వర్గానికి, ముఖ్యంగా వెనుక బడిన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సంకల్ప సభతో సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వానికి ప్రజాభిప్రాయాన్ని బలంగా వినిపించనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆకాంక్షించిన సామాజిక తెలంగాణ నిర్మాణమే సభ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ వర్గాలకు చెందిన అనేక కులాల వారికి కనీసం గ్రామ సర్పంచ్ స్థాయిలో కూడా రాజకీయ అవకాశాలు లభించడం లేదని, అన్ని సామాజిక వర్గాలకు రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించే దిశగా ఈ సభ వేదిక కానుందని చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు, మేధావులు, యువత, సామాజిక సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, కుమార్, వెంకటేష్ , అశోక్, చందు, రాజేష్, కిషన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

516 సార్లు జై శ్రీరామ్ రాసిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు...

- చిన్నారుల్లో భక్తి భావం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమం
- యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ రాజ్‌కుమార్

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :
చిన్నారుల్లో భక్తి భావం, సనాతన విలువలను పెంపొందించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మ రాజ్‌కుమార్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా 10 సంవత్సరాల లోపు వయస్సు గల చిన్నారులు "జై శ్రీరామ్" అని 516 సార్లు రాసిన వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తుమ్మ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ఆధునిక యుగంలో పిల్లల్లో భక్తి భావం, నైతిక విలువలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో 15 సంవత్సరాల లోపు వయస్సు గల చిన్నారుల కోసం మరిన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.స్వల్ప వ్యవధిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, సుమారు 500 మందికి పైగా చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు. దశలవారీగా వారందరికీ ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సమత కుమార్, యువ సంకల్ప ఫౌండేషన్ సభ్యులు చిలగాని విశ్వనాథ్, తుమ్మని శాంత్, మెగా బ్లడ్ డోనర్ గాలిపల్లి కుమార్, రమేష్, శివ, న్యూ హారిజన్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వప్న, గుంటి రాకేష్, చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహం.. భావోద్వేగాల బంధం

- 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్

ప్రజా వాయిస్ హుస్నాబాద్:
ప్రపంచంలో ఎలాంటి రక్తసంబంధం లేకుండానే హృదయాలను కలిపే గొప్ప బంధం స్నేహబంధమని 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ అన్నారు. ఆదివారం ఫ్రెండ్షిప్ డే సందర్భంగా తన ఆత్మీయ మిత్రులతో కలిసి ప్రత్యేకంగా సమావేశమై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్నేహం అనేది కష్టసుఖాల్లో తోడుగా నిలిచి జీవితానికి బలాన్నిచ్చే అపురూపమైనది అన్నారు. మదిలోని భావాలను భావోద్వేగాల పంచుకునే బంధమని అన్నారు.ప్రతి ఒక్కరూ స్నేహితుల విలువను గుర్తించి, ఆ బంధాన్ని జీవితాంతం కాపాడుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బత్తిని శ్రీకాంత్ గౌడ్, పచ్చిమట్ల శ్రీకాంత్ గౌడ్, నూతి గిరి, ఒగ్గోస్ భాస్కర్, బొమ్మగాని రజినీకాంత్ గౌడ్, ఆరుమూరి నరేష్, దుబ్బాల శ్రీనివాస్, గడిపే శ్రీనివాస్, మునిగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకాన్ని వమ్ము చేయను

- పరిగి టౌన్, మండల కాంగ్రెస్‌కు వారాల సిరాజుద్దీన్ ఇన్‌చార్జి

ప్రజావాయిస్ / మోమిన్ పేట్ :
కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా జిల్లా నాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంలో భాగంగా పరిగి నియోజకవర్గంలోని పరిగి టౌన్ ,పరిగి మండల కాంగ్రెస్ కమిటీల ఇన్‌చార్జిగా మోమిన్‌పేట్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వారాల సిరాజుద్దీన్ ను నియమించింది. ఆదివారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ధారాసింగ్ నియామక ఉత్తర్వులను అందజేసి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు సిరాజుద్దీన్‌కు అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారాల సిరాజుద్దీన్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. గ్రామ గ్రామాన పర్యటిస్తూ కార్యకర్తలను సమన్వయం చేసి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.
తనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించిన శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ధారాసింగ్‌తో పాటు పార్టీ అధిష్ఠానానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా నాయకత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పరిగి టౌన్, మండల పరిధిలో పార్టీ కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని, సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కారు యూనియన్ సర్పంచ్‌గా బానోతు శంకర్ నాయక్ ఘన విజయం

- కోదాడ పట్టణంలోని సాయి గార్డెన్‌లో ఉత్కంఠగా ఎన్నికలు
- ప్రత్యర్థిపై 130 ఓట్ల మెజారిటీతో విజయం
- యూనియన్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని విజేత హామీ

ప్రజా వాయిస్, కోదాడ:
కోదాడ పట్టణంలోని సాయి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన కారు యూనియన్ సర్పంచ్ ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఎన్నికల్లో బానోతు శంకర్ నాయక్ సభ్యుల విశ్వాసాన్ని చూరగొని ప్రత్యర్థిపై 130 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఫలితాలు వెలువడగానే యూనియన్ సభ్యులు, ఆయన అభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు వేసి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. విజయం అనంతరం బానోతు శంకర్ నాయక్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి యూనియన్ సభ్యుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం తనది కాదని, యూనియన్ సభ్యులందరిదేనని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో సభ్యులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు కట్టుబడి ఉంటానని చెప్పారు.యూనియన్‌కు సంబంధించిన సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానన్నారు.డ్రైవర్లు, వాహన యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సంక్షేమ అంశాలు, యూనియన్ అభివృద్ధికి సంబంధించిన ప్రతి విషయంపై సభ్యులతో కలిసి పనిచేస్తానని తెలిపారు. సభ్యులందరినీ కలుపుకొని పారదర్శకంగా యూనియన్‌ను ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

మునుగోడులో 'కంటి విప్లవం'.. వేలాది మందికి వెలుగు

- 16వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహణ
- 15 శిబిరాల్లో 11,654 మందికి పరీక్షలు
- 2,490 మందికి శస్త్రచికిత్సలు
- 5,272 మందికి ఉచిత కళ్లజోళ్లు పంపిణీ
- 16వ శిబిరంలో 415 మందికి పరీక్షలు.. 157 మంది ఆపరేషన్లకు ఎంపిక

ప్రజా వాయిస్,మునుగోడు:

మునుగోడు నియోజకవర్గంలో ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ 'కంటి విప్లవం' కొనసాగుతోంది. నియోజకవర్గంలో ఎవరూ కంటి సమస్యలతో ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి తన మాతృమూర్తి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో 16వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య నాయకులు కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఇప్పటివరకు నిర్వహించిన 15 విడతల శిబిరాల్లో మొత్తం 11,654 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 2,490 మందికి కంటి శస్త్రచికిత్సలు పూర్తిచేశారు. అలాగే 5,272 మందికి ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రిగూడ, ఘట్టుప్పల్, నారాయణపూర్, చౌటుప్పల్ తదితర ప్రాంతాల్లో ఈ శిబిరాలు నిర్వహించి వేలాది మంది లబ్ధి పొందారు.

16వ విడత శిబిరంలో 415 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 157 మంది శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర కంటి ఆసుపత్రికి ఉచిత శస్త్రచికిత్సల కోసం తరలించారు. నియోజకవర్గంలో కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి నిరుపేదకు నాణ్యమైన చికిత్స అందించడమే లక్ష్యమని, రాబోయే రోజుల్లో 10 వేల మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించే లక్ష్యంతో కార్యక్రమాన్ని మరింత విస్తరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

ఫలాంబరి దేవిగా దర్శనమిచ్చిన ఏడుపాయల వన దుర్గమ్మ.....

- అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు...



ప్రజా వాయిస్, పాపన్నపేట:

పాపన్నపేట మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వన దుర్గమ్మ తల్లి పలాంబరి దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పోరుగు రాష్ట్రాలైనటువంటి, మహారాష్ట్ర, కర్ణాటక హైదరాబాద్ నుండి భారీగా భక్తులు రావడం జరిగింది. అనంతరం భక్తులు మంజీరా నదిలో పుణ్యా స్నానాలు ఆచరించి కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారమైన ఏడుపాయల వన దుర్గమ్మకు వివిధ రూపాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి తగు జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్సై నేతృత్వంలో ప్రతిష్టమైన బాందోబస్తు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఏడుపాయల సిబ్బంది, మరియు ఆలయ అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహాయం

ప్రజా వాయిస్/పాలకుర్తి :

పాలకుర్తిమండల కేంద్రానికి చెందిన ఎడవెల్లి ఉప్పలయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి 25 కేజీల బియ్యం,నిత్యావసరాలు,కూరగాయలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ పాల్గొని మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి, ఆసరా ఇవ్వడం ఆత్మ సంతృప్తినిస్తుందని తెలపడం జరిగింది. కార్యక్రమానికి సహకారాన్ని అందించిన చుంచు శ్రీలత టీచర్ కి ట్రస్ట్ తరుపున కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి ఒర్రె కుమారస్వామి ట్రస్ట్ ప్రతినిధి పెండ్లి భాస్కర్ రెడ్డి మరియు మృతుడి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవతమైన వసతి, పౌష్టికాహారం అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

ప్రజా వాయిస్/చెన్నూరు :

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన వసతి, పౌష్టికాహారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. ఆదివారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల తహసిల్దార్ మల్లికార్జున్, మండల విద్యాధికారితో కలిసి సందర్శించి విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, తరగతి గదులు, వసతి గృహాలు, ఇతర మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినుల ఆరోగ్య దృష్ట్యా పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన ఆహారాన్ని నిరంతరం అందించాలని తెలిపారు. భోజనశాలను పరిశీలించి సమర్థవంతంగా వినియోగించుకోవాలని, విద్యాలయ ప్రాంగణంలో ఉన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని చెన్నూరు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. విద్యాలయానికి వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన విద్య, భద్రత, వసతి, పోషకాహారం అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి, పోషకాహారం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అంతకు ముందు చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి మున్సిపల్ సిబ్బందిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టారు. తహసీల్దార్, సంబంధిత అధికారులతో కలిసి వార్డు నెం. 1, 8 లలో లబ్ధిదారుల ఇండ్లను సందర్శించి పథకం అమలు, లబ్ధిదారుల వివరాలు, అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమీక్షించారు. చెన్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, ఫిర్యాదులపై సమగ్ర విచారణ నిర్వహించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ఫలాలు పారదర్శకంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ పర్యటనలో మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపల్లిలో భక్తిశ్రద్ధల మధ్య బోనాల ఉత్సవాలు

* శ్రీ కోటమ్మ తల్లి ఆశీస్సులు పొందిన మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:

బూరుగుపల్లి గ్రామ శ్రీ కోటమ్మ తల్లి ఆలయంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ఆశీర్వచనాలు అందించగా, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని శ్రీ కోటమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు గ్రామీణ ప్రాంతాల్లో భక్తి భావాన్ని, సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జహీరాబాద్ లో వైభవంగా బోనాల పండుగ

- బోనం ఎత్తిన మహిళలు..
- పోతురాజుల విన్యాసాలు..
- డీజే పాట ఆటలతో డప్పు సప్పుల్లా దరువులతో భారీ బోనాల ఊరేగింపు ర్యాలీ..
- ఘనంగా అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు..

ప్రజా వాయిస్ జహీరాబాద్:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఆయా వార్డులలో ఆయా కూల సంఘాల ఆధ్వర్యంలో బోనాల పండుగ వేడుకలు మహా ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు బోనాలు ఎత్తుకొని ఊరడమ్మ ,మరియ పెద్దమ్మ తల్లి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అదేవిధంగా పోతురాజుల విన్యాసాలు, డప్పు సప్పులతో అమ్మవారి విగ్రహంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అంతేకాకుండా యువత సందడితో వేడుకలు ఉత్సాహంగా సాగాయి. అమ్మవారు చల్లగా చూడాలని, తమ కోరికలు నెరవేరాలని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు..

మిర్యాలగూడలో స్వరాల సందడి

- 'స్వర రాగ స్రవంతి' తొలి సంగీత విభావరి ఘనంగా నిర్వహణ
- సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న శ్రీనివాస కల్చరల్ స్టూడియోకు ప్రశంసలు
- ప్రముఖ న్యాయవాదులు పూసపాటి పరమేష్, నేతి సత్యనారాయణలకు ఘన సన్మానం
- ధుర గానాలతో అలరించిన స్థానిక గాయనీగాయకులు
- కొత్త ప్రతిభను వెలికితీసే వేదికలు మరిన్ని రావాలని ఆకాంక్ష

ప్రజా వాయిస్,మిర్యాలగూడ :

మిర్యాలగూడలోని శ్రీనివాస కల్చరల్ ఎయిర్ కండిషన్డ్ మినీ స్టూడియోలో ఆదివారం "స్వర రాగ స్రవంతి" తొలి సంచిక సంగీత విభావరి వైభవంగా జరిగింది. స్టూడియో అధినేతలు వై. శ్రీనివాసరావు, వై. విష్ణుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కందుకూరి సుదర్శన్ పర్యవేక్షణ వహించారు.

ఈ కార్యక్రమానికి స్పాన్సర్‌గా వ్యవహరించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మిర్యాలగూడ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది పూసపాటి పరమేష్‌తో పాటు సీనియర్ న్యాయవాది నేతి సత్యనారాయణను నిర్వాహకులు, గాయనీగాయకులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పూసపాటి పరమేష్ మాట్లాడుతూ కళలు మానసికోల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యానికి కూడా దోహదపడతాయని అన్నారు. సమాజంలో సాంస్కృతిక విలువలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

సీనియర్ న్యాయవాది నేతి సత్యనారాయణ మాట్లాడుతూ సంగీతం అందించే ఆనందం అనిర్వచనీయమని అన్నారు. శ్రీనివాస కల్చరల్ స్టూడియో వేదికగా కళలను ప్రోత్సహిస్తున్న నిర్వాహకుల కృషి అభినందనీయమని కొనియాడారు. న్యాయవాద వృత్తితో పాటు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం సంతృప్తినిస్తుందని, మధురమైన పాటలతో శ్రోతలను అలరించిన గాయనీగాయకుల ప్రతిభ ప్రశంసనీయమని చెప్పారు. మిర్యాలగూడలో ఇలాంటి కళా వేదికలు మరిన్ని ఏర్పడి కొత్త ప్రతిభ వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో శైలజ, నాగమణి, సరస్వతి, మౌనిక, ముదుంబై దామోదరాచార్యులు, నందిగామ అరవిందశర్మ, రవి, వంగూరి శ్రీనివాస, కందుకూరి సుదర్శన్, ఏలె సత్యనారాయణ తదితరులు మధుర గానాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

ఈ కార్యక్రమంలో పునీత్, పబ్బతి గంగాధర్, శేఖర్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు. చివరగా స్టూడియో అధినేత వై. విష్ణుష్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

బొమ్మా బొరుసు ఆడుతున్న 9 మంది అరెస్టు

- రూ.7,910 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు

మెదక్ ప్రజా వాయిస్ :

మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామంలో కల్లు దుకాణం వెనుకవైపు బొమ్మా బొరుసు ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మా బొరుసు ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,910 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో శేఖర్, యాదగిరి, చంద్రశేఖర్, ప్రవీణ్, చంద్రం, కిష్టయ్య, పోలె లక్ష్మణ్, దుర్గేష్, నిఖిల్ ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ.. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, జూదం, పేకాట, బొమ్మా బొరుసు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత జూదం, బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, ఇలాంటి కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు.

స్నేహం చెరిగిపోదు.. జ్ఞాపకాలు మరువలేం!

- ఫ్రెండ్ షిప్ డే వేళ ఒక్కటైన 1993–94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు..
- ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆనందం..
- పాత జ్ఞాపకాలు, స్నేహబంధం. స్నేహితుల ఆత్మీయంగా పలకరింపులు.
- పూర్వ విద్యార్థులు స్కూల్ ను సందర్శించి అక్కడ ఆటలు ఆడి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.
- కొడకండ్ల కొడకండ్ల సీతారామ గార్డెన్లో అపూర్వ ఆత్మీయ సమ్మేళనం

ప్రజా వాయిస్/జనగామ జిల్లా (కొడకండ్ల):

కాలం పరుగులు తీసింది.. చదువులు పూర్తయ్యాయి.. జీవితంలో ఎవరి దారులు వారివయ్యాయి.. కానీ పాఠశాల ప్రాంగణంలో మొలకెత్తిన స్నేహబంధం మాత్రం చెక్కుచెదరలేదు. దీనికి నిదర్శనంగా ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. అనంతరం 1993–94 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు కొడకండ్ల సీతారామ గార్డెన్లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సుమారు 120 మంది పూర్వ విద్యార్థులు ఒకే చోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు చూసుకున్న స్నేహితులు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనాటి రోజులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల గదులు, తరగతి గదులు, ఆటస్థలం, లో కోకో వాలీబాల్ కబడ్డీ ఆడిన ఆటలు స్నేహితులతో చేసిన అల్లరి, కలిసి చదువుకున్న రోజులు, గురువుల మందలింపులు, పరీక్షల భయం, విరామ సమయంలో చేసిన సందడి.. ఇలా ప్రతి జ్ఞాపకం నాటి స్నేహాన్ని మరోసారి కళ్లముందు నిలిపింది.

జీవితంలో ఎన్నో పరిచయాలు వస్తాయి.. పోతాయి.. కానీ బాల్యంలో పాఠశాల బెంచిపై ఏర్పడిన స్నేహం మాత్రం మనసులో శాశ్వతంగా నిలిచిపోతుందనే విషయాన్ని ఈ సమ్మేళనం మరోసారి చాటిచెప్పింది. వయసు పెరిగినా.. బాధ్యతలు పెరిగినా.. సంవత్సరాలు గడిచినా.. స్నేహానికి వయసు లేదని జెడ్ పి ఎస్ ఎస్ స్కూల్ ను సందర్శించి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పూర్వ విద్యార్థులు కోకో వాలీబాల్ కబడ్డీ వంటి ఆటలు ఆడి వారి కలయిక నిరూపించింది.

ఫ్రెండ్ షిప్ డే రోజునే కొడకండ్ల సీతారామ గార్డెన్ లో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. ఎలాంటి ముఖ్య అతిథులు లేకుండా పూర్వ విద్యార్థులందరూ కలిసి స్వయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం విశేషం. ఒకరినొకరు పలకరించుకుంటూ, పాత జ్ఞాపకాలను పంచుకుంటూ, నవ్వులు చిందిస్తూ ఎంతో ఉత్సాహంగా గడిపారు.

నాటి స్నేహం.. నేటి కలయిక.. రేపటి అనుబంధం అనే భావనతో పూర్వ విద్యార్థులంతా స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ తరచూ ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకుని, తమ మధ్య ఉన్న అనుబంధాన్ని తరతరాలకు గుర్తుండేలా కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. పాఠశాల చదువు ముగిసినా.. స్నేహం చదువు ముగియలేదు. కాలం గడిచినా.. జ్ఞాపకాలు పాతబడలేదు. జీవితాలు మారినా.. స్నేహితుల మనసుల్లోని ఆత్మీయత మాత్రం అలాగే ఉంది. ఫ్రెండ్ షిప్ డే రోజున జరిగిన ఈ అపూర్వ కలయిక 1993–94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల జీవితాల్లో మధుర జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఈ యొక్క కార్యక్రమాన్ని ముందు ఉండి ఇంత పెద్ద ఎత్తున చేసిన మిత్రులకు స్నేహితులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

లేడీ కిలాడి అరెస్ట్

- నిందితురాలి నుంచి 3తులాల బంగారం స్వాధీనం
- బంగారంతో పరారైన మహిళ కేసు ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ పరమేశ్వర్ గౌడ్

ప్రజావాయిస్/తాండూరు/వికారాబాద్:

బంగారు పుస్తెలతాడును కాజేసిన నిందితురాలిని తాండూరు పట్టణ పోలీసులు అరెస్టు చేశారు.ఆమె వద్ద నుంచి దొంగిలించిన సుమారు మూడు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. తాండూరు పట్టణ సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధారూర్ ప్రాంతానికి చెందిన నీరటి స్వరూప 8నెలల క్రితం వైద్యలింగం, విజయమ్మల ఇంట్లో నివాసం ఉండేది.

పుస్తెలతాడును ఫోటో తీసుకుంటానని నమ్మించి చేతిలోకి తీసుకున్న అనంతరం అక్కడి నుంచి పరారైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన తాండూరు పట్టణ పోలీసులు నిందితురాలు నీరటి స్వరూపను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె నేరాన్ని అంగీకరించడంతో అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి దొంగిలించిన సుమారు మూడు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

హుస్నాబాద్ వైశ్య భవన్‌లో ఘనంగా గోరింటాకు వేడుకలు...

ప్రజా వాయిస్ హుస్నాబాద్ :

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని వైశ్య భవన్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం, మహిళా విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు గోరింటాకు చెట్టు వద్దకు వెళ్లి ఆకులు తెంపుకొని సంప్రదాయ పద్ధతిలో నూరి, ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ జానపద గీతాలు పాడి ఆషాఢ మాస విశిష్టతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం అనేది తరతరాలుగా వస్తున్న గొప్ప సాంప్రదాయమని తెలిపారు. గోరింటాకు మహిళల అందాన్ని పెంచడమే కాకుండా శరీరానికి చల్లదనాన్ని అందించి, వర్షాకాలంలో వచ్చే చర్మ సంబంధిత సమస్యలను తగ్గించడంలో దోహదపడుతుందని పేర్కొన్నారు. కొత్తగా వివాహమైన మహిళలు, పెళ్లికాని యువతులు గోరింటాకు పెట్టుకోవడం శుభప్రదంగా భావించే ఆనవాయితీని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి , రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షురాలు మాడిశెట్టి హేమలత, రాష్ట్ర కార్యదర్శి నార్ల విజయలక్ష్మి , పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, కోశాధికారి బబ్బుల రవీందర్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి యాంసాని భాగ్యలక్ష్మి , కోశాధికారి గోగుల రాధిక, యువజన విభాగం నాయకుడు కుంభంపాటి సందీప్‌తో పాటు ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

20 ఏళ్లకు కలిశారు..

- **2006–07 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**
- **రెండు దశాబ్దాల తర్వాత ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు**

ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:

పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎన్నేళ్ల తర్వాత ఒకేచోట కలిసిన సహపాఠులు విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.
ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా గురువుల పాత్ర మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం సహపాఠులతో కలిసి స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ పాత అనుభవాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమం ఆప్యాయత, అనుబంధాల నడుమ ఉత్సాహంగా సాగింది.

వేమనపల్లి లైబ్రరీకి పుస్తకాలు పంపిణీ చేసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్

ప్రజా వాయిస్ | బెల్లంపల్లి :

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని వేమనపల్లి లైబ్రరీకి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ అందగా నిలిచారు. గత వారం రోజుల క్రితం ఈ లైబ్రరీని సందర్శించిన సందర్భంగా, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.విద్యార్థుల విజ్ఞప్తికి స్పందించిన ఆయన, తన సొంత డబ్బులతో కాంపిటీటివ్ పుస్తకాలను కొనుగోలు చేసి ఈరోజు నేరుగా వేమనపల్లి లైబ్రరీకి అందజేశారు. అంతేకాకుండా, జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీతో మాట్లాడి మంచిర్యాల లైబ్రరీ నుండి ప్రత్యేకంగా కుర్చీలను కూడా తెప్పించి ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో ఈ ప్రాంత యువత తమ ప్రతిభను చాటుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు లైబ్రరీలో తాగునీటి కోసం వాటర్ ప్యూరిఫైర్ కావాలని కోరగా, త్వరలోనే దానిని కూడా ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ తో పాటు దస్నాపూర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, ఏనుముల శేఖర్, చెన్నూరు సంతోష్, తదితరులతో పాటు భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రంథాలయ ఆవరణలో వారు మొక్కలు నాటారు.

మదినగూడ నుండి సంగారెడ్డి వరకు జాతీయ రహదారి పనులు వేగంగా పూర్తి చేయాలి

- **నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి**
- **జిల్లాలో దెబ్బతిన్న రోడ్లన్నీ బాగు చేయాలి**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

ప్రజావాస్ సంగారెడ్డి :

జాతీయ రహదారి పనులను వేగంగా మరియు నాణ్యతగా పనులు వెంటనే పూర్తి చేయాలని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.నేడు సంగారెడ్డి కేకే భవన్ లో జరిగిన సమావేశం లో మాట్లాడుతూ రెండు సంవత్సరాలైనా జాతీయ రహదారి పనులు పూర్తి కాకపోవడం దారుణమన అన్నారు. నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విస్తరణ పనులలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన సంగారెడ్డి నుంచి లింగంపల్లి వరకు అనేక చోట్ల ట్రాఫిక్ విపరీతంగా జామవుతుందని అన్నారు.గంటల తరబడి సమయం వృధా అవుతుందని అన్నారు. అలాగే ఈ రోడ్డుపైన రోజు బైకులు, వాహనాలు బోల్తా పడి ప్రమాదాలు జరుగుతున్నాయని చాలామందికి కాళ్లు, చేతులు విరుగుతున్నాయని గాయాల పాలు అవుతున్నారనీ ఆయన అన్నారు. ముందస్తు ప్రాణాలిక లేకుండా, రోడ్డు విస్తరణ పనులు చేయడం ద్వారానే ట్రాఫిక్ జామవుతుందని, గుంతలు తొందరగా పూడ్చకపోవడం వల్లనే వర్షం నీరు జామ అవుతుందని ఆయన అన్నారు. గుంతలలో బైకులు, భారీ వాహనాలు పడుతున్నాయని అన్నారు. వర్షాలు ఎక్కువ వచ్చినప్పుడు వర్షం నీరు రోడ్డు మీదకు రావడం వలన కూడా ట్రాఫిక్ జామ్ అవుతుందని, కనీసం తగిన చర్యలు తీసుకోకపోవడం వలన ఇవి జరుగుతున్నాయని ఆయన అన్నారు. పనులు కూడా చేస్తున్నారని ఆయన విమర్శించారు. మోరీలు నిర్మించితే నెల రోజులు కాక ముందుకే ఆ కూలిపోతున్నాయని ఆయన అన్నారు. మ్యాన్ హోల్డ్ సరిగా వేయలేదని ఆయన అన్నారు, సిమెంటు, కంకర ఇసుక తదితర మెటీరియల్ సరిగా వాడట్లేదని అన్నారు. కవలం పేట, గణేష్ గడ్డ, రుద్రారం, ఇస్నాపూర్, ముత్తంగి, పటాన్చెరు, బీరంగూడ అనేక చోట్ల ట్రాఫిక్ జామవుతుందని ఆయన అన్నారు. పేషెంట్లను హైదరాబాద్కు తరలించాలంటే ప్రాణాలు పోతున్న పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి అధికారులు నిద్రపోతున్నారా అని ఆయన ప్రశ్నించారు, పనులు నెమ్మదిగా జరగడానికి కారకులు ఎవరని ఆయన అన్నారు, జిల్లా అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని విస్తరణ పనులు వేగంగా జరిగేటట్టుగా చూడాలని, నాణ్యతగా పనులు జరిగేటట్టుగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాణిక్, నర్సిములు, అశోక్ పాల్గొన్నారు

ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మిత్రుడికి ఆర్థిక సాయం

- **రూ 30 వేల చేయూత అందించిన కీసర జడ్.పి.హెచ్.ఎస్ 2010–11 పూర్వ విద్యార్థులు**

మేడ్చల్ జిల్లా, కీసర / ప్రజా వాయిస్ :

స్నేహితుల దినోత్సవం సందర్భంగా కీసర జెడ్పీహెచ్ఎస్ (ZPHS) ప్రభుత్వ పాఠశాల 2010–11 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ సహచర మిత్రుడు సీహెచ్ మధుకు రూ.30 వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందించి స్నేహబంధం గొప్పతనాన్ని చాటిచెప్పారు. మధు ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న బాల్య మిత్రులు వెంటనే స్పందించి, స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.30 వేల రూపాయలు సహాయ నిధిని సమీకరించారు. అనంతరం ఆ మొత్తాన్ని మధుకు అందజేసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, "స్నేహితుడి కష్టం మా కష్టమే. ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న మధుకు అండగా నిలవడం మా బాధ్యతగా భావించాం. అవసరమైతే భవిష్యత్తులోనూ మా పూర్తి సహకారం కొనసాగుతుంది" అని తెలిపారు. ఆర్థిక సాయం అందుకున్న సీహెచ్ మధు, తనను మరచిపోకుండా అండగా నిలిచిన సహచర మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థులు చేపట్టి ఈ మానవతా కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. కష్టకాలంలో స్నేహితుడికి చేయూతనివ్వడమే నిజమైన స్నేహమని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

వేమనపల్లి లైబ్రరీకి పుస్తకాలు పంపిణీ చేసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్

ప్రజా వాయిస్ | బెల్లంపల్లి :

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని వేమనపల్లి లైబ్రరీకి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ అందగా నిలిచారు. గత వారం రోజుల క్రితం ఈ లైబ్రరీని సందర్శించిన సందర్భంగా, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.విద్యార్థుల విజ్ఞప్తికి స్పందించిన ఆయన, తన సొంత డబ్బులతో కాంపిటీటివ్ పుస్తకాలను కొనుగోలు చేసి ఈరోజు నేరుగా వేమనపల్లి లైబ్రరీకి అందజేశారు. అంతేకాకుండా, జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీతో మాట్లాడి మంచిర్యాల లైబ్రరీ నుండి ప్రత్యేకంగా కుర్చీలను కూడా తెప్పించి ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో ఈ ప్రాంత యువత తమ ప్రతిభను చాటుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు లైబ్రరీలో తాగునీటి కోసం వాటర్ ప్యూరిఫైర్ కావాలని కోరగా, త్వరలోనే దానిని కూడా ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ తో పాటు దస్నాపూర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, ఏనుముల శేఖర్, చెన్నూరు సంతోష్, తదితరులతో పాటు భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రంథాలయ ఆవరణలో వారు మొక్కలు నాటారు.

మిన్పూర్ లో ఆషాఢ మాసం బోనాల మహోత్సవం..

ప్రజా వాస్ సంగారెడ్డి :

మిన్పూర్ గ్రామంలో వీర హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ పోచమ్మ తల్లికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం బోనాల మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.
ఈ సందర్భంగా గ్రామంలో విగ్రహాల ఉరేగింపు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారికి అలంకరణ, ప్రత్యేక పూజలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల గుండా పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, భక్తుల జైజైధ్వానాల మధ్య ఉత్సాహభరితంగా సాగాయి.
ఈ మహోత్సవంలో పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం పలు ఏర్పాట్లు చేసారు.

నీట్‌లో ప్రతిభ చాటిన రామకృష్ణాపూర్ విద్యార్థిని బి. రిషిత వర్మ

ప్రజా వాయిస్ / రామకృష్ణాపూ :

మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన శ్రీ బాలాజీ టౌన్‌షిప్, గద్దెరగడ్డి ప్రాంతానికి చెందిన బి. రిషిత వర్మ నీట్ (NEET) పరీక్షలో విశిష్ట ప్రతిభ కనబరిచింది. ఈ ప్రతిభావంతురాలి తండ్రి శ్రీనివాస్.రిషిత వర్మ తన విద్యాభ్యాసాన్ని అత్యుత్తమంగా సాగించింది. మందమర్రి లోని టీఎస్ మోడల్ స్కూల్లో పదో తరగతి పూర్తి చేసి 10 జీపీఏ సాధించింది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి 977 మార్కులు సాధించి మెరిసింది.ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 88,276తో పాటు, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 1,239 ర్యాంక్ సాధించి తన సత్తా చాటుకుంది. ఈ అరుదైన విజయం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు మరియు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత వైద్య విద్యను అభ్యసించి, సమాజానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో ఆమె ముందుకు సాగుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

జోరుపాశం నైవేద్యం

భక్తిశ్రద్ధలతో చిన్నగూడెం భక్తులు.. వరుణ దేవుడి కరుణతో పడిన వర్షం..

ప్రజా వాయిస్,పెద్దవూర:

నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలోని చిన్నగూడెం గ్రామంలోని శ్రీ గంగమ్మ తల్లి దేవాలయం వద్ద వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ గ్రామస్తులు, భక్తులు భక్తిశ్రద్ధలతో "జోరుపాశం" ప్రసాదాన్ని వండి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు ఆలయం వద్ద ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ అమ్మవారిని కీర్తించారు. ఆలయంలో నైవేద్యం నివేదించిన కొద్ది గంటల్లోనే వరుణ దేవుడు కరుణించి గ్రామంలో మోతాదు వర్షం కురవడంతో గ్రామస్తులు, రైతన్నలు తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తరతరాల ఆచారం.. అమ్మవారి కృపతోనే వర్షం: ఆలయ పూజారి

ఈ సందర్భంగా ఆలయ పూజారి నడ్డి నరసింహ మాట్లాడుతూ... "మా గ్రామంలో వర్షాలు రాని సమయంలో అమ్మవారికి జోరుపాశం నివేదించే ఆచారం ఎప్పటి నుంచో కొనసాగుతోంది. అలా అమ్మవారికి భక్తితో జోరుపాశం సమర్పించిన ప్రతిసారీ వర్షం కురవడం మా ఊరి నమ్మకం, అనుభవం. ఈ రోజు కూడా పాశం పోసిన కొద్ది గంటల్లోనే గ్రామంలో వర్షం రావడం శుభసూచకం" అని తెలిపారు.

సమిష్టి కృషితోనే కార్యక్రమం విజయం.

గ్రామ పెద్దల సమిష్టి నిర్ణయంతోనే ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని పూజారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం

అందించిన గ్రామ పెద్దలు గంప శేషగిరిరావు, గంప శ్రీనివాసరావులకు, అలాగే ప్రత్యేక సహకారం అందించిన యాదవ పెద్దగోళ్ల నడ్డి బొర్రయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ పూజా కార్యక్రమంలో వార్డు మెంబర్ కట్టెబోయిన శంకర్ యాదవ్, గ్రామ పెద్దలు జానపటి ఆంజనేయులు, బూడిగం అనసూర్య, రావుల రామకృష్ణ, రావుల అనిల్, చిలుకల కోటేష్,తదితరులతో పాటు గ్రామ

మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి భజనలు చేస్తూ ప్రసాదాన్ని స్వీకరించారు.